వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 19 ఆగస్టు 2022


## క్షేత్రస్థాయిలో భూ రీ సర్వే పరిశీలించిన ఐఏఎస్ అధికారులు



**పెండ్లిమర్రి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండలంలోని ఎస్.రామాపురం సమీప పొలాల్లో గురువారం భూ రీ సర్వేని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ సిద్ధార్థ్ జైన్, ఎల్ఐసీ ఛైర్మన్ అజయ్ కల్లం, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు భూ రీ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పొలాల్లో భూ రీ సర్వేను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వే వలన రైతులకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయా లేదా అని అలాగే సర్వే నెంబర్ల వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా భూ సర్వే గురించి రైతులు తెలుసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఈ సర్వే ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. రైతులు చెప్పిన సమాధానాలకు అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. మొయిళ్లకాల్వ సచివాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఎరువులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో ధర్మ చంద్రారెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ బాలయ్య, డిప్యూటీ సీవో రమణారెడ్డి, తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజు, సర్పంచ్ హుసేన్, ఏడీ, సింగిల్ విండో నాగేంద్రరెడ్డి, సర్వేయర్ గంగయ్య, వీఆర్వోలు, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల కోసం ఆపన్న హస్తం వన్‌స్టాఫ్ సెంటర్ (సఖీ)



**కడప లీగల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్.కవిత కడప నగరం రిమ్స్ ఆవరణ లో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను (సఖీ) సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాఫ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే చోట అనేక సేవలు కలవని, వన్‌స్టాప్ సెంటర్‌లో ఉన్న మహిళలతో మాట్లాడారు. రిజిస్టర్లను ఈ సందర్భంగా ఆమె పరిశీలించారు. వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, మానసిక సలహాలు, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవ లు ఉంటాయన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు సంప్రదించవచ్చన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. మహిళలు 181 ఉమెన్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 100 పోలీసు హెల్ప్‌లైన్ మొదలగు టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కలిగి ఉండా లని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారిని సంప్రదించాలని తెలిపారు.

## ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్‌తో పారదర్శకత

- నాణ్యమైన విద్యా బోధనలో భాగంగానే అమలు

- పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకట కృష్ణారెడ్డి వెల్లడి

**కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



ఉపాధ్యాయుల హాజరులో పారదర్శకత పెంపొందించేందుకు ప్రభుత్వం నూతనంగా ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం అమల్లోకి తీసుకొని వచ్చిందని పాఠశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మార్లా వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. విద్యా వ్యవస్థలోని లోటుపాట్లను పర్యవేక్షించడానికి ఈ హాజరును ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఉపాధ్యాయులు ఫేస్ రికగ్నైజేషన్ తో హాజరు నమోదు చేసుకునేలా పాఠశాల విద్యాశాఖ టీచర్స్ అటెండెన్స్ యాప్ అనే సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తతీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే టీచర్స్ అటెండెన్స్ యాప్‌ను చాలా మంది ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకున్నా రన్నారు. ఉపాధ్యాయులంతా ఉదయం 9గంటల లోపు ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా తమ హాజరును నమోదు చేయాలన్నారు. జీపీఎస్ అనుసంధానంతో యాప్‌ను రూపొందించినందుకు హాజరు ఎక్కడ వేశారనే ప్రదేశం కూడా నమోదవుతుందన్నారు. యాప్‌లో అటెండెన్స్‌కు కొంతమంది ఉపాధ్యాయులకు అంటే అంధులు, దీర్ఘకాలిక సెలవులో ఉన్న వారికి మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. నెట్‌వర్క్ లేనిచోట ఆన్‌లైన్‌లో కూడా హాజరు నమోదు చేయవచ్చన్నారు. యాప్ ద్వారా హాజరు నమోదులో ఎలాంటి సమస్యలు ఎదురైనా 14417 టోల్ ఫ్రీ నంబరుకు సంప్రదించాలని సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

### - అధికారులతో సీఎం వైఎస్ జగన్



సీఎంకు అభివృద్ధి పనులపై వివరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయ్ రామరాజు, అధికారులు.

**పులివెందుల, ఆగస్టు 18, ప్రభాతవార్త**

పులివెందుల అభివృద్ధిలో భాగంగా పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ (పాడా) ఆధ్వర్యంలో జరుగుతున్న అన్ని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం పాడా పనులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా కలెక్టరు విజయ్ రామరాజు, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి రావత్, కార్యదర్శులు సత్యనారాయణ, గుల్జార్, ప్రణాళికా విభాగం కార్యదర్శి విజయ్‌కుమార్, పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు. పనుల పురోభివృద్ధిపై ఎంపీ అవినాష్‌రెడ్డి, అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని, పనుల పురోగతిపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని తెలిపారు. జీఎన్ఎస్ఎస్ మెయిన్‌కాల్వపై 41వ కిలోమీట రు వద్ద మొగమూరు ఆక్వాడెక్ట్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. పైడిపాలెం, కుమ్మరాంపల్లె గ్రామాలకు చెందిన 535 కుటుంబాలకు ముంపు బాధితుల పరిహారం మంజూరు చేయాలని తెలిపారు. పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించి వివిధ అభివృద్ధి పనులు వేగవం తం చేయాలని, అలాగే పులివెందుల సిటీ సెంటర్ పనులపై దృష్టి పెట్టాలని తెలిపారు. హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని అధికారులు సీఎంకు వివరించగా నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. వాటర్‌గ్రిడ్ పనులు, పులివెందుల మెడికల్ కాలేజి, యూజీడీ, బస్టాండు నిర్మాణం, తదితర అంశాలపై అధికారులు సీఎంకు వివరించారు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో అరటిపంటకు ఈక్రాప్ బుకింగ్ చేయా లని సీఎం తెలిపారు. మైదుకూరు, కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడు గు నియోజకవర్గాల్లో పెండింగ్ సమస్యలపై సమావేశంలో చర్చించారు.

## వీర సైనికుడా నేకు జోహార్లు

### సైనిక లాంఛనాల మధ్య అంతిమ వీడ్కోలు

### ఆర్మీ జవాన్ రాజశేఖర్ భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించిన కలెక్టర్, ఎస్పీ





**సంబేపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త :**

జమ్మూ-కాశ్మీర్‌లో ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ జవాన్ల ప్రయాణిస్తున్న బస్సు లోయలో పడిన సంఘటనలో అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం, దేవపట్లకు చెందిన ఆర్మీ జవాన్ డి. రాజశేఖర్ విధులు నిర్వహిస్తూ మృతి చెందిన విషయం తెలిసిందే. జవాన్ రాజశేఖర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గురు వారం ఉదయం కలెక్టర్ గిరీషా పిఎస్, ఎస్పి హర్షవర్ధన్‌రాజు తదితర ఉన్నతాధికారులు జవాన్ రాజశేఖర్ పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. జవాన్ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జవాన్ రాజశేఖర్ 12 సంవత్సరాలుగా ఐటిబిపిలో పని చేస్తూ పోలీసు జవాన్ల ప్రయాణిస్తున్న బస్సులోయలో పడి మృతి చెందడంతో ఆయన పార్థివదేహం స్వగ్రామానికి చేరుకుంది. అంత్యక్రియలు సైనిక లాంఛనాలతో జరిగాయి. జవాన్ రాజశేఖర్ పార్థివ దేహంపై జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. వీరజవాన్లను తుదివీడ్కోలు పలికేందుకు జనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆయన పార్థివదేహాన్ని చూసి గ్రామస్తులు విలపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జవాన్ కుటుంబానికి అండగా ఉంటుందని కొన్ని రోజుల్లో పరిహారం చెక్కును అందజేస్తామని కలెక్టర్ వెల్లడించారు. జవాన్ మృతదేహానికి బెటాలియన్ అధికారులు, డిప్యూటీ కమాండర్ ఆయూష్ దీపక్, డిప్యూటీ కమాండర్ వెంకటేశ్వరరెడ్డి, స్థానిక పోలీసులు ఘనంగా నివాళి అర్పించారు.





## రైతన్నలను ఆదుకునేందకు ఈనెల 20న జిల్లా పర్యటనకు వస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

### - నాదెండ్ల మనోహర్



**కడప కార్పొరేషన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

రైతు కంట కన్నీరు దేశానికి అరిష్టం.. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. కౌలు రైతుల కుటుంబాలకు రూ.లక్షల నిధులు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 20న జనసేన అధినేత కౌలు రైతులకు చెక్‌లు అందించడానికి కడప జిల్లా పర్యటనకు వస్తున్నారని తెలిపారు. గురువారం కడప నగరంలోని శ్రీనివాస రెసిడెన్సీలో ఆ పార్టీ నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అప్పుల (మిగతా IIవ పేజీలో)

## అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్‌డ్యామ్ కొట్టుకుపోయి 9 నెలలు

### జగన్ సర్కార్ పరిపాలన అనుమతి కోసం పడిగాపులు

### కొత్త రేట్ల ప్రకారం అంచనాలు సిద్ధం చేసేందుకు ఆదేశాలు

### రూ.800 కోట్లకు పెరగనున్న పునర్నిర్మాణ అంచనా వ్యయం



కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్‌డ్యామ్, కొట్టుకుపోయిన ఎర్త్‌డ్యామ్ స్థానంలో నిర్మించనున్న ప్రతిపాదిత కాంక్రీట్ డ్యామ్

**రాజంపేట అర్బన్, ఆగస్టు 18 ప్రభాతవార్త**

అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్‌డ్యాం కొట్టుకుపోయి 9 నెలలు దాటింది. గత యేడాది నవంబరు 19న భారీ వరద విధ్వంసంతో అన్నమయ్య ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోయింది. వరద ఉధృతి తగ్గేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు నెలల సమయం పట్టింది. నిపుణుల కమిటి పరిశీలించింది. నిపుణులు స్వయంగా డ్యామ్‌ను పరిశీలించారు. డ్యామ్ భవిష్యత్తు దృష్ట్యా పునర్నిర్మాణంపై నిపుణులు కూడ ఆచితూచి అభిప్రాయాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకు కారణం ప్రాజెక్టు నిర్మాణం నాటినుంచి అన్నమయ్య ప్రాజెక్టును బాలారిష్టాలు వీడలేదు. ప్రాజెక్టు నిర్మాణం తర్వాత రెండుసార్లు గేట్లు కొట్టుకుపోయాయి. చివరకు ఎర్త్‌డ్యామ్ కూడ కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో నిపుణులు పలు సిఫారసులను చేశారు. వీటి ఆధారంగా ప్రాజెక్టు అధికారులు పునర్నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాల్సి వచ్చింది. అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపి రెండు నెలలైంది. ఆర్థికశాఖ ఆమోదానికి నివేదిక వెళ్లింది. ఇంతలోపు తాజాగా కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణ అంచనాలు రూపొందించాలని జలవనరులశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు గత నెలలోనే 775 కోట్ల వ్యయంతో అంచనాలకు తుదిమెరుగులు దిద్దిన అధికారులు మరలా తాజా ఆదేశాలతో అంచనాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కొత్త రేట్ల ప్రకారం ప్రాజెక్టు పునర్నిర్మాణ వ్యయం 800 కోట్లు దాటే పరిస్థితి కనిపిస్తోంది. 16 గేట్లతో పునర్నిర్మాణం కానున్న అన్నమయ్య ప్రాజెక్టు పనులకు ఎప్పుడు జగన్ సర్కార్ ఆమోద ముద్ర వేస్తుందోనని ఆయకట్టు రైతులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. తాజాగా కొత్త రేట్ల ప్రకారం అంచనాలు రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఆర్థికశాఖ ఆమోదానికి మరింత సమయం పట్టనుంది. ఇప్పటికే జాప్యం జరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో జిల్లా నుంచి ప్రాజెక్టు అధికారులు సిద్ధం చేసిన అంచనాల పునర్నిర్మాణ ప్రాజెక్టు నివేదిక ప్రభుత్వానికి చేరిన తర్వాతే ఆర్థికశాఖ ఆమోదం లభించనుంది. ఆర్థికశాఖ ఆమోద ముద్ర పడినంతవరకు ప్రాజెక్టు నిర్మాణానికి టెండర్లు పిలిచే అవకాశం లేదు. ఎందుకంటే ఆర్థికశాఖ క్లియరెన్స్ లభించినట్లయితే ప్రభుత్వం ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేస్తుంది. అప్పుడే డిపిఆర్ పిలుస్తారు. సాంకేతికపరమైన మంజూరుకు ఫైలు కదులుతుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాతే టెండర్లకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేలోపు మరలా నవంబరు 19 వస్తుందనడంలో సందేహం లేదు. ఈ సీజన్ ముగిసేలోపు కనీసం పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతాంగం ముక్తకంఠంతో కోరుతోంది.

## జిల్లాలో అన్ని గ్రామాల్లో రీసర్వే పనులు ముమ్మరం

### కలెక్టర్ గిరీషా పిఎస్





**రాయచోటి, ఆగస్టు 18 ప్రభాతవార్త**

జిల్లాలో అన్ని గ్రామాల్లో రీసర్వే పనులు ముమ్మరంగా చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ పేర్కొన్నారు. గురువారం కడప కాలెక్టరేట్ స్పందన హాలులో.. "జగనన్న శాశ్విత భూ హక్కు - భూ రక్ష" పథకంలో భాగంగా చేపడుతున్న రీసర్వే అమలు తీరు, పురోగతిపై.. రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డుల కమీషనర్ సిద్ధార్థ్ జైన్ తో కలిసి.. వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, జేసిలు, ఆర్డీఓలు, సంబంధిత అధికారులతో "జగనన్న శాశ్విత భూహక్కు - భూ రక్ష పథకం" రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ చైర్మన్ అజయ్ కలాం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, అన్నమయ్య జిల్లా జేసీ తమీమ్ అన్సారీయా హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ మాట్లాడుతూ....జిల్లాలో రీ సర్వే పనులు ప్రణాళికా బద్ధంగా వేగవంతంగా చేపడుతున్నామన్నారు. మూడు రెవెన్యూ డివిజన్లలో ప్రణాళిక ప్రకారం.. నిర్దేశించిన లక్ష్యం మేరకు డ్రోన్ ఫ్లై ప్రక్రియ పూర్తిచేయడం జరుగుతోందన్నారు. రీ సర్వే ప్రక్రియ మొదలయ్యాక అన్ని గ్రామాల్లో సర్వే నెంబర్లు, భూమి పట్టాదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా రైతుల భూముల సరిహద్దులు విషయంలో ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వకుండా ఉండేందుకు ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. సర్వే చేయడంతో పాటు భూముల సరిహద్దులు తెలిపే విధంగా సర్వే రాళ్ళు కూడా ఆయా భూముల్లో పాత కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రీ సర్వేలో భాగంగా జిల్లాల్లో పనుల స్టేటస్ వివరాలను, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న పలు సమస్యలను కలెక్టర్, జెసి చైర్మన్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలపై చర్చించారు.

## గౌస్‌నగర్‌లో ఉద్రిక్తత

### - అక్రమ కట్టడాలను కూల్చడానికి వెళ్లిన ఉద్యోగులు

### - అడ్డుకున్న స్థానికులు - ముగ్గురిపై కేసు నమోదు



**కడప క్రైం, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

కడప నగరంలోని గౌస్‌నగర్‌లో గురువారం ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. అక్రమ కట్టడాలను కూల్చేందుకు వెళ్లిన నగరపాలక సంస్థ ఉద్యోగులపై స్థానికులు దాడి చేయడంతో ఇరువురి మధ్య తోపులాట చోటు చేసుకుని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో టుటౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితి సర్దుమనిగించారు. ఈ ఘటనకు చెందిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరపాలక సంస్థ కమిషనర్ సాయి సూర్య ప్రవీణ్ చంద్ అక్రమ కట్టడాలను కూల్చాలని సిబ్బందిని ఆదేశించడంతో గత కొద్ది రోజులుగా కడప నగరంలోని పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు కూల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా స్థానిక గౌస్‌నగర్‌లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసేందుకు గురువారం ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పొక్లైన్లతో అక్కడికి చేరుకొని అక్రమ (మిగతా IIవ పేజీలో)

## అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారిగా డాక్టర్ లోకవర్ధన్ బాధ్యతల స్వీకరణ



**రాయచోటి రూరల్, ఆగస్టు 18ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారిగా డాక్టర్ లోకర్ధన్‌ను నియమి స్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డాక్టర్ లోకవర్ధన్ గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని మదనపల్లె డివిజన్ డిప్యూటి డిఎంహెచ్‌వో గా దాదాపు ఒకటిన్నర సంవత్సరం పూర్తి అదన పు బాధ్యతలు నిర్వహించారు. అనంతరం చిత్తూ రు జిల్లా 104, 108 సేవల జిల్లా నోడల్ అధికారిగా పనిచేశారు. చిత్తూరు జిల్లా డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల జిల్లా నోడల్ అధికారిగా కూడా సేవలు అందించారు. అనంతరం నూతన జిల్లా ఏర్పాటులో భాగంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ప్రోగ్రాం ఆఫీసర్‌గా సేవలు అందిస్తున్నారు. గురువారం అన్నమయ్య జిల్లా జిల్లా కేంద్రం రాయచోటిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయంలో అన్నమ య్య జిల్లా మొదటి జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్యకి జాయినింగ్ రిపోర్ట్ సమర్పించి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకవర్ధన్ మా ట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలు వంద శాతం అమలులో, లక్ష్య సాదనకు కృషి చేస్తానన్నారు. మాతాశిశు సంరక్షణ సేవల నిధులు, సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు చేపట్టి అమలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌వంవో, ఇతర అధికారులు డాక్టర్ లోకవర్ధన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## రీ సర్వే పనులు పారదర్శకంగా పూర్తి చేయాలి

### ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు, జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ ఛైరన్ అజయ్ కలాం

### భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వేపై.. కలెక్టర్లు, జె.సి.లతో సమీక్ష



**కడప, ఆగస్టు 18 ప్రభాతవార్త :**

రెవెన్యూ భూముల స్వచ్ఛీకరణలో భాగంగా.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే పనులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు, "జగనన్న శాశ్విత భూహక్కు - భూ రక్ష పథకం" రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ చైర్మన్ అజయ్ కలాం అధికారులను ఆదేశించారు. గురువారం కడప కాలెక్టరేట్ స్పందన హాలులో.. "జగనన్న శాశ్విత భూ హక్కు - భూ రక్ష" పథకంలో భాగంగా చేపడుతున్న రీసర్వే అమలు తీరు, పురోగతిపై.. రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డుల కమీషనర్ సిద్ధార్థ్ జైన్ తో కలిసి.. వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, జేసిలు, ఆర్డీఓలు, సంబంధిత అధికారులతో "జగనన్న శాశ్విత భూహక్కు - భూ రక్ష పథకం" రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటి చైర్మన్ అజయ్ కలాం ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో వైఎస్ఆర్ జిల్లా జేసీ సాయికాంత్ వర్మతో పాటు.. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు హరినారాయన్, గరిష పి.ఎస్., అన్నమయ్య, తిరుపతి జేసీలు తమీమ్ అన్సారీయా, బాలాజీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అజయ్ కలాం మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ల నుండి జేసిల, ఆర్డీఓలు, క్రింది స్థాయి అధికారుల వరకు సర్వే నియమాలు, టీమ్ వరకు స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. "దున్నేవాడిదే భూమి" అన్న సామెత ప్రకారం.. పొలాన్ని దున్నే వాడికే భూమిపై సర్వ హక్కులు కల్పించాలని ప్రభుత్వం యోచించి.. నిజమైన అనుభవ దారులకే పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆర్.ఓ.ఆర్., సర్వే %ు% బౌండరీ చట్టానికి లోబడి అనుభవ దారులకు భూ హక్కులు, వారి భూములకు కూడా పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. అందులో భాగంగా రెవెన్యూ, సర్వే అధికారులు, సంబంధిత అధికారులు.. సమన్వయంతో, టీమ్ వర్కుతో ముందుజు సాగాలన్నారు. రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా భూమి హక్కుదారులకు సర్వహక్కులు అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రధానంగా రీసర్వేపై జిల్లా కలెక్టర్లు, జేసీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రత్యేక ముఖ్యకార్యదర్శి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేలు ఎంతో ఉపయోగకరం అన్నారు. భూముల సర్వే కోసం స్పందనలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని.. అందులో ఎలాంటి తాత్సారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రీ సర్వేలో భాగంగా ఆయా జిల్లాల్లో పనుల స్టేటస్ వివరాలను, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న పలు సమస్యలను జేసిల, కాలెక్టర్లు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చి.. పరిష్కార మార్గాలపై చర్చించారు. రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డుల కమీషనర్ సిద్ధార్థ్ జైన్ మాట్లాడుతూ.. భూమి మీద ఉన్న వాస్తవాలకు అద్దం పట్టేలా భూ రికార్డులను తీర్చిదిద్దాలన్నారు. "జగనన్న శాశ్విత భూ హక్కు - భూ రక్ష" పథకంలో భాగంగా అన్ని గ్రామాల్లో భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీసర్వే పనులను వేగవంతంవగా పూర్తి చేయాలన్నారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో భూ సర్వే పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అప్ డేట్ చేసిన రికార్డులను అనుసరించి భూ సర్వే పనులను చేపట్టాలన్నారు. రీసర్వే కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ జిల్లా జేసీ.. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ.. జిల్లాలో రీ సర్వే పనులు ప్రణాళికా బద్ధంగా వేగవంతంగా చేపడుతున్నామన్నారు. మూడు రెవెన్యూ డివిజన్లలో ప్రణాళిక ప్రకారం.. డ్రోన్ ఫ్లై ప్రక్రియ పూర్తిచేయడం జరుగుతోందన్నారు. జిల్లాలోని 36 మండలాలు, 4 రెవెన్యూ డివిజన్లలో రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. 130 హాబిటేషన్ లో డ్రోన్ ఫ్లై కవర్ చేయడం జరిగింది. ఇనాం భూములు, కోర్టు సెటిల్మెంట్ భూములు, దీర్ఘ కాలిక అనుభవ దారులు.. మొదలైన అన్ని రకాల అంశాలను పరిగణలోకి తీసుకుని.. రీసర్వే పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. రీ సర్వే ప్రక్రియ మొదలయ్యాక అన్ని గ్రామాల్లో సర్వే నెంబర్లు, భూమి పట్టాదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ జిల్లా డిఆర్వో రామ్మోహన్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు ధర్మాచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, డిపిఓ ప్రభాకర్ రెడ్డి, ల్యాండ్ సర్వే శాఖ ఎడి ఏ. కనక ప్రసాద్ రావు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు

### గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రభుత్వ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకొంటున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, ఆగస్టు 18 ప్రభాతవార్త :**

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని 6వ వార్డు శివాజీనగర్‌లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను మన ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. వైఎస్ఆర్ సిపి మూడేళ్ళ పాలనలో ప్రజలకు ప్రభుత్వం నేరుగా అందించిన సంక్షేమ పథకాలు పంపిణీపై ఇంటింటికి వెళ్ళి నేరుగా ప్రజలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకొన్నారు. కాలనీలో సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తాగునీటి సరఫరాకు పైప్‌లైన్, మురుగుకాలువలు నిర్మించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నాటుసారా విక్రయాలు అధికంగా జరుపుతున్నారని, తాగుబోతులతో ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే పోలీసులతో మాట్లాడి శివాజీనగర్‌లో నాటుసారా విక్రయాలపై దృష్టిపెట్టాల్సిందిగా ఆదేశించారు. ఏ చిన్న చిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కాలువల, పైప్‌లైన్ నిర్మాణాలకు ఎస్టిమేట్లు తయారు చేయాల్సిందిగా డిఈ శిరిషకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, డిష్ రామక్రిష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, రామిశెట్టి శివయ్య, పాల్ చంద్రశేఖర్, వసీం, సర్పంచ్‌లు దండు కురణాకర్‌రెడ్డి, వెంకటరమణ, వైఎస్ఆర్ సిపి నాయ కులు రఫీ, ఎస్.ఎ. కరీముల్లా, సుధాకర్, బావాజాన్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పునీత్, టిపిఓ జకీరా, ఆర్ఓ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

## వాజపేయి నగర్ వాసుల నష్ట పరిహారానికి కృషి

### బాధితులకు ఎమ్మెల్యే రాచమల్లు భరోసా



ప్రొద్దుటూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని పదో వార్డు వాజపేయి నగర్ హరిజన వాడలో నివాసమున్న 120 కుటుంబాలకు రెండు లక్షల రూపాయల పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాచముల్లు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు గురువారం వాజపేయి నగర్ వాసులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి వారితో చర్చించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముప్పై సంవత్సరాల క్రితం ప్రైవేట్ స్థలం నందు నివాసాలు ఏర్పాటు చేసుకున్న దాదాపు 120 కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో ఆగస్టు 23వ తారీఖులోగా స్థలం ఖాళీ చేయవలసిందిగా ఫిబ్రవరి 2022న కోర్ట్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే నన్నారు. గత ఆరు నెలలుగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారితో తాను సంప్రదించి వారి అనుమతితో ఖాళీ చేయించే ఏర్పాటు చేశానని, ప్రభుత్వం తరుపున తాను ఇక్కడి నివాసులకు స్థలాలు ఇప్పించి, పట్టా దారుల నుండి ఖాళీ చేసిన ప్రతి నివాస గృహానికి దాదాపు రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయం ఇవ్వాలని బాధితుల తరపున అధికారులను కోరారు. ప్రభుత్వ అధికారులు భూ యజమానులతో చర్చించి వాజపేయి నగరవాసులకు పరిహారం అందించి తగు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హై కోర్ట్ ఉత్తర్వులను గౌరవిస్తూ, పట్టాదారుల ఆస్తిని వారికి ఇప్పించి, పేదవారిని సంరక్షించవలసిన బాధ్యత ఎమ్మెల్యేగా తనపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ కౌన్సిలర్ ఇర్ఫాన్ భాషా గరిశపాటి లక్ష్మీదేవి వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## 22న ప్రొద్దుటూరులో కడప జిల్లా స్థాయి షాట్ పట్ విసరు పోటీలు

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 18 ప్రభాతవార్త :

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు నెల 22వ తేదీ సోమవారం ఉదయం 10 గం.కు అనిబిసెంట్ పురపాలక ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం, ప్రొద్దుటూరులో 14, 16, 18, 20 సం.ల లోపు, బాలురకు బాలికలకు జిల్లా స్థాయి షాట్ పట్ విసరు పోటీలు నిర్వహించబడును. పోటీదారులు తమ వయస్సు ధ్రువీకరణ కొరకై ఆధార్ కార్డు చూపించాలి. విజేతలకు ప్రశంసా పత్రాలు బహుకరించబడతాయి. ప్రతిభ కనబరిచిన వారు ఆగస్టు నెల 26వ తేదీ గుంటూరులో జరుగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయబడతారని భాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్ బాషా తెలిపారు. వివరాలకై 9949686586, 8019880995 మహబూబ్ బాషాను సంప్రదించాలన్నారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో నేడు కృష్ణాష్టమి వేడుకలు



ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 18 ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో నేడు పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ నందు ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రచారకులు నిరంజన్ ప్రభు తెలిపారు. గురువారం స్థానిక ఇస్కాన్ ప్రచార కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ భక్తిని ప్రతి ఒక్కరికీ పంచాలనే ఉద్దేశ్యంతో శ్రీల ప్రభు పాదుల వారు అమెరికా లో ఇస్కాన్ ను స్థాపించి అక్కడ నుండి భక్తి ప్రచారం ప్రారంభించారని వివరించారు. ప్రస్తుతం ప్రపంచమంతా ఇస్కాన్ ప్రచార కేంద్రాలు వున్నాయని, అన్ని కేంద్రాలలో కృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని తెలిపారు. యువతకు ఇస్కాన్ పై అవగాహన కల్పించడం తమ ధ్యేయమన్నారు. నేడు కృష్ణాష్టమి సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ నందు సాయంత్రం 4 గంటలకు హరి నామ సంకీర్తన, కృష్ణా, బలరాముల దర్శనము, 7 గంటలకు గౌర హారతి, 10.30 కి శంఖాభిషేకం, పుష్పాభిషేకం, మహా హారతి, తీర్థ ప్రసాద వితరణ వుంటుందని వివరించారు. ప్రజలు పాల్గొని కృష్ణ కృపకు పాత్రులు కావాలని సూచించారు.

## ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ



ప్రొద్దుటూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్ కాలనీలోని పురపాలక ప్రాథమిక పాఠశాల డాక్టర్ సంధ్యారాణి ఆర్థిక సహకారంతో చైతన్య సాంఘిక సేవా సంఘం ఆధ్వర్యంలో 230 మంది విద్యార్థులకు సంఘం అధ్యక్షులు కరుమూరి వెంకట రమణయ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధ్యాపాధ్యాయులు గురప్ప ఈశ్వర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్కా బీటర్ అరెస్ట్



కడప క్రైం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

కడప చిన్నచౌక్ పాత బైపాస్ వద్ద మట్కా ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి మట్కా బీటర్‌ను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు ఎస్సై ఎస్.కె.రోషన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు తమ సిబ్బందికి ముందుగా రాబడిన సమాచారం మేరకు గురువారం చిన్నచౌకు పాత బైపాస్ వద్ద మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిపై దాడులు నిర్వహించి అతన్ని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద రూ.10వేలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కోలాహలంగా కృష్ణాష్టమి వేడుకలు



కడప కార్పొరేషన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:

గురువారం కడప నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపల్ గీత ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజీఎం చెన్నకేశవ రాజు, ఆర్ఐ కిరణ్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు వైస్‌ప్రిన్సిపల్స్, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రశంసలు అందుకున్న మిట్స్ కళాశాల




కురుబలకోట, ఆగస్టు 18 ప్రభాతవార్త :

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంస్థ అయిన ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఏపిఎస్‌సిహెచ్ఇ విజయవాడ వారు మదనపల్లె సమీపం లో గల అంగళ్ళు లోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కు ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఏపిఎస్‌సిహెచ్ఇ యొక్క క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ క్యూఎసి వారు మిట్స్ కళాశాలకు నాక్ ఎన్ఏఏసి ఎ+ గ్రేడ్‌తో సిజిపిఎ 3.3 వచ్చినందుకు గాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ ను సత్కరించి ప్రశంసించింది. విజయవాడ లోని ఆంధ్రా లయోలా కళాశాల (అటానమస్) కళాశాలలో నిర్వహించిన ప్రశంసా కార్యక్రమం లో ప్రొఫెసర్ కె. హేమచంద్ర రెడ్డి, చైర్మన్, ఏపిఎస్‌సిహెచ్ఇ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజ్ ను శాల్వా తో సత్కరించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ ఘనత సాధించడానికి ప్రోత్సహించిన తమ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ యెన్ విజయ భాస్కర్ చౌదరి మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కు మరియు విద్యార్థులు వారి తలిదండ్రుల కు కృతతలు అని ఆయన అన్నారు.

## మోటారు మరమ్మతు పనులు పరిశీలించిన ఎండీవో

ఓబులవారిపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



ఓబులవారిపల్లె మండలం లింగిరెడ్డి పల్లె గ్రామంలో తరచూ పంచాయతీ మోటారు చెడిపోవడంతో ఎందుకు మరమ్మతులకు గురవుతోంది, తదితర వివరాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. స్టాటర్, మోటారు మరమ్మతులు పరిశీలించి చెడిపోకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలను గ్రామస్థులకు వివరించారు. ఇప్పటికే పంచాయతీలో నిధులు లేక అధికారులు, సర్పంచులు కొట్టుమిట్టాడుతుంటే మోటార్లు తరచూ చెడిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని అందువల్ల మంచి మెకానిక్ ద్వారా మోటారు పనులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు వైర్లు మరమ్మతు పనులు పరిశీలించిన ట్రాన్స్‌కో ఏఈ

ఓబులవారిపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



ఓబులవారిపల్లె మండలం చిన్నంపల్లె గ్రామంలో విద్యుత్తు లైన్లు కిందికి వేలాడడంతో ఎండీవో విజయారావు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్‌రెడ్డికి తెలపడంతో ఆయన వెంటనే గ్రామం చేరుకొని అక్కడి విద్యుత్తు లైన్లు పరిశీలించి మరమ్మతులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదపుటంచున్న ఉన్న వైర్లను లైన్‌మెన్లు తగిన జాగ్రత్తలు తీసుకొని మరమ్మతులు చేయించాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఎక్కడైనా విద్యుత్తు సమస్యలు వస్తే సంబంధిత లైన్‌మెన్లకు గాని, ఏఈకి గాని, అధికారులకు తెలిపితే సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

ఓబులవారిపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లె మండలం కాపుపల్లె గ్రామానికి చెందిన వైసీపీ యువ నాయకులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డికి గుంతకల్లు డివిజన్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సభ్యునిగా నియమించినట్లు ఆదేశాలు అందడంతో విషయం తెలుసుకున్న భరత్‌కుమార్‌రెడ్డి ఈ పదవికి సహకరించిన లోక్‌సభ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని తిరుపతిలోని అతని నివాసంలో గురువారం కలిసి ఆయనకు పర్యావరణ పూలమొక్కలను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి నాకు దక్కేలా సహకరించిన నాయకులు, పెద్దలకు రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపినట్లు తెలిపారు. బాధ్యతగా తన వంతు ప్రజలకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వాల్మీకి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



వాహనాలు నడిపే వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కడప-చెన్నై ప్రధాన రహదారి అయిన మంగంపేట హైవేలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే వాహనాలకు సంబంధించిన పత్రాలు తమ వద్దే ఉంచుకోవాలన్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేసేటప్పుడు ఆపితే ఆపాలే తప్ప స్లో చేసి తిరిగి వేగం పెంచరాదని అలా చేస్తే ప్రమాదాలకు గురవుతా రన్నారు. ఎవరైనా సమస్యలు ఉంటే చెప్పి వెళ్లాలే తప్ప ఆపితే ఏదో నేరం చేసినట్లు బాధపడకూడదన్నారు. ఆయన వెంట ఓబులవారిపల్లె పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్ దృష్టికి దళితుల సమస్యలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను తిరుపతి ఓ సమావేశానికి వచ్చిన సందర్భంగా గురువారం ఆయన ను కడప జిల్లా సమతా సైనిక్ దళ్ నాయకులు చౌడవరం సుబ్బనరసయ్య, పలువురు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు జిల్లాలో ఉన్న దళిత సమస్యలు, దళితులకు రావాల్సిన రుణాలు, తదితర విషయాల గురించి తెలిపారు. అన్ని విధాలా దళితుల హక్కులు కాపాడి ఎక్కడా దళితులను చిన్నచూపు చూడకుండా దళితులపై దాడులు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలను ఆదుకునేందకు ఈనెల 20న జిల్లా పర్యటనకు వస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

బాధలు తాళలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా జగన్ సర్కార్ కనికరం చూపించలేదన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా కర్షకులకు చేయూతనందించి ఒడ్డున చేర్చా ల్సిన ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకోవడానికి జనసేన ముందుంటుందని తెలి పారు. సొంత నిధులను కౌలు రైతుల కుటుంబాలకు అధినేత పవన్ కల్యాణ్ ఇస్తున్నారని చెప్పారు. జనసేన అధ్యక్షుడు చేస్తున్న కార్యక్రమం దేశంలో ఎవరూ చేయడం లేదని కొనియాడారు. సీఎం సొంత జిల్లాలోనూ, నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రా లకు రూ.వేల కోట్లు కేటాయించామని చెప్పుకుంటున్న వైసీపీ నేతల మాటలు బూటకమని కొట్టిపారేశారు. రైతులను కులాల వారీగా ప్రభుత్వం విడగొ ట్టిందన్నారు. సీఎం సొంత జిల్లాలో వరదల్లో జనసైనికులు ముందుకు వెళ్లి ప్రజ లకు సేవలు చేశారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికీ పరిస్థితి భయా నకంగా ఉంది. వరద ప్రాంతాల్లో నష్టపోయిన వారిని తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## మా భూమి సమస్యను పరిష్కరించండి

### - మాకు ప్రాణ రక్షణ కల్పించండి



కడప వైద్య విభాగం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

మా భూమి సమస్యను పరిష్కరించి మా కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని మిద్దె అక్బర్ బాషా తెలిపారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ అండదండలు ఉన్న తిరుపాల్‌రెడ్డి తన భూమిని సాగు చేసుకోనీయకుండా అడ్డుకుంటూ పోలీసులతో బెదిరిస్తున్నాడని వాపోయారు. దువ్వూరు మండలం మాచనపల్లె మజరా ఎర్రబల్లె గ్రామ పొలంలో 325/1 సర్వే నెంబర్‌లో 1.50 ఎకరాలు భూమి ఉందని, ఆ భూమి తన అత్తమామలు తన భార్యకు రాయించారన్నారు. సర్వ హక్కులు తమకు ఉన్నప్పటికీ తమను పోలీసులతో బెదిరించి తమ కుటుంబాన్ని మానసికంగా క్షోభకు గురి చేస్తున్నారన్నారు. తన భూమిని తనకు ఇవ్వకపోతే చావే శరణ్యమని తెలిపారు. రాజకీయ అండదండలు ఉన్న తిరుపాల్‌రెడ్డి టీటీడీ బోర్డు సభ్యత్వం రాలేదని అందుకు కారణం తానేనని మా కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయాడు. అతనిపై చర్యలు తీసుకొని తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

## ఇంటిగ్రేటెడ్ యాప్‌ను రద్దు చేయాలి : ఎస్టీయు



మైదుకూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త:

ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం తదితర వివరాలను అప్‌లోడ్ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ యప్‌ను మా స్వంత ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్టీయు నాయకులు కోరారు. ప్రభుత్వం ఏదైనా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తే మా హాజరు, విద్యార్థుల హాజరు నమోదు చేస్తామని, మిగిలిన వివరాలు అప్‌లోడింగ్ బాధ్యత మా నుండి తప్పించాలని కోరారు.

## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీడబ్ల్యూవో సురేష్‌బాబు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త:

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ సీడబ్ల్యూఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. ఉన్న వసతి గృహాలు అద్దె భవనం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని నూతన భవనంలోకి సెప్టెంబరు 1వ తేదీన మారుస్తున్నట్లు ఆయన విద్యార్థులకు తెలిపారు. నూతన భవనంలో విద్యార్థులు ఎలాంటి అపరిశుభ్రత చేయకుండా చదువుకోవాలన్నారు. సెప్టెంబరు 1వ తేదీన స్థానిక శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి నూతన భవనాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బస్టాండ్ కోసం సంతకాల సేకరణ



దువ్వూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టాలంటూ మండల బీజేపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. గురువారం దువ్వూరులోని మెయిన్‌రోడ్డు, వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్రజలతో సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరవేటి హరికృష్ణ మాట్లాడుతూ దువ్వూరులో బస్టాండు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉంటూ ఇబ్బందులుపడుతున్నారన్నారు. మహిళలు, చిన్న పిల్లలు కూర్చునేందుకు కూడా లేదని దుకాణాల వద్ద నిలబడితే దుకాణాల యజమానులు వారిని చీకొడుతున్నారన్నారు. ప్రజలు, ప్రయాణికుల శ్రేయస్సు దృష్ట్యా దువ్వూరులో బస్టాండు నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందుకోసం 10వేల సంతకాలు సేకరించి సీఎంకు పంపుతున్నామని, ఇప్పటి వరకు 8వేల సంతకాలు సేకరించామన్నారు. అలాగే సీఎంకు బస్టాండు నిర్మాణం చేపట్టాలంటూ 4వేల పోస్టు కార్డులు ప్రజల నుంచి పంపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు బస్టాండు సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి అనువైన స్థలంలో నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల హక్కులపై పోరాడుదాం

### మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు



చిట్వేలి, ఆగస్టు 18 ప్రభాతవార్త

దళిత హక్కులపై పోరాడుతామని ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు నాగేశ్వరరావు, చిట్వేలి మండల అధ్యక్షులు జోరోపల్లె వెంకటసుబ్బయ్యలు తెలిపారు. గురువారం పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ దళిత హక్కుల గురించి పోరాడుతామని, ఎస్‌సి వర్గీకరణ వద్దు... ఐక్యతే ముద్దు అని వారు అన్నారు. దళిత సమస్యలపై దళిత భూసమస్యలపై పోరాడుతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ప్రతి దళిత రైతు అభివృద్ధి చెందాలన్నదే మాలమహానాడు ఐక్యవేదిక లక్ష్యమని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. దళితులందరూ మాలమహానాడు ఐక్యవేదిక మద్దతుగా నిలవాలని, సమస్యలపై పోరాడుతున్న వారికి మద్దతుగా నిలవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఐక్యవేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత సేవలు స్ఫూర్తిదాయకం

గాలివీడు, ఆగస్టు 18ప్రభాతవార్త



మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని, తనవంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని ఎంపిడివో శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం మానవత శాంతి ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి స్వార్థం వారు చూసుకుంటున్న ఈరోజుల్లో ఇలాంటి సేవా సంస్థలు పేదలకు బాసటగా నిలుస్తున్నాయని, మానవత పలు సేవా కార్యక్రమాలతో సమాజానికి సేవ చేస్తూ మానవత సంస్థ సభ్యులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తు న్నారన్నారు. అనంతరం జడ్పీబాలుర ఉన్నత పాఠశాల ఆవరణం నుంచి గేటు పావని సర్కిల్, బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మెన్ సుబ్బారెడ్డి, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు, రెడ్డెన్న, ఉపాధ్యాయులు బయా ్యరెడ్డి, గౌస్, వెంకటరమణరెడ్డి, వెంకటేష్ నాయక్, గోరాన్ చెరువు ఎంపిటిసి శ్రీనివాసులు, సంస్థ సభ్యులు చెంగల్‌రాజు, దామో దరయ్య, రామకృష్ణ నాయుడు, డాక్టర్ నరసింహులు, క్రిష్ణ, మనోహర్ రెడ్డి, భాస్కర్, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

## కౌలురైతు భరోసా యాత్రను విజయవంతం చేయండి

### మండల జనసేనపార్టీ నాయకులు



చిట్వేలి, ఆగస్టు 18 ప్రభాతవార్త

జనసేనపార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగో విడత కౌలురైతుల భరోసా యాత్రను కడప జిల్లాలోని సిద్ధవటంలో జరుగుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం చిట్వేలి జనసేనపార్టీ నాయకులు మాదా సు నరసింహా, సుధీర్‌రెడ్డి, పురం సురేష్, పగడాల శివ, భరత్‌లు అన్నారు. ఈ సందర్భంగా మాదాసు నరసింహా మాట్లాడుతూ 161 మంది కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని చనిపోయిన ప్రతి కౌలురైతుకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్వయంగా వచ్చి చన చేతులమీదుగా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 17 మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకోగా చిట్వేలిలో 5 మంది ఆత్మహత్య చేసుకొన్నారు. వీరందరికి కూడ జనసన అధినేత పవన్ కళ్యాణ్ ఈనెల 21న భరోసా ఇవ్వడంతో పాటు లక్ష రూపాయలు ఆర్థికసాయం అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి జనసేనపార్టీ నాయకులు తుపాకుల పెంచ లయ్య, షేక్ రియాజ్, మాదాసు శివ, పగడాల భరత్, మురళీకృష్ణ, చిరంజీవి, నరసింహా, కదుమూరి నాగరాజు, మాదినేని హరి, నాగిశెట్టి శివకుమార్, తిరుమలశెట్టి హరి, పవన్‌రాజు, సువ్వారపు హరి పాల్గొన్నారు.

## గౌస్‌నగర్‌లో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

కట్టడాలు కూల్చేందుకు ప్రయత్నించారు. స్థానికంగా ఉన్న క్రాంతి కుమార్ అనే వ్యక్తి తమ ఇంటికి సంబంధించి హైకోర్టులో స్టే ఉందని ఎలా కూలుస్తారని సిబ్బందిపై దాడికి దిగాడు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారి కిశోర్‌కుమార్, సచివాలయ సిబ్బందిపై క్రాంతి కుమార్ అతని అనుచరుల మధ్య తోపులాట జరిగింది. కిశోర్ కుమార్, తన అనుచరులు సచివాలయ సిబ్బందిపై దాడి చేయడంతో నగరపాలక సంస్థ కమిషనర్ అక్కడికి చేరుకొని సిబ్బందిపై దాడి చేస్తారా అని ఇంటిని కూల్చేందుకు ఆదేశించారు. దీంతో పరిస్థితి మరింత విషమించింది. టుటౌన్ ఎస్సై రాఘవేంద్రరెడ్డి అక్కడికి చేరుకొని పరిస్థితి సద్దుమనిగేలా చేశారు. దాడికి పాల్పడిన క్రాంతి కుమార్, మరి కొంత మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## సీఆర్ఐ ఆశయ సాధన కోసమే ట్రస్ట్



కడప వైద్య విభాగం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

పలు సేవల ద్వారా పేద ప్రజల అభిమానాన్ని చూరగొని బీసీ నాయకులుగా గుర్తింపు పొందిన మా తండ్రి స్వర్గీయ సీఆర్ఐ సునీల్, సీఆర్ఐ దినేష్‌లు పేర్కొన్నారు. బుధవారం సీఆర్ఐ సుబ్బారెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా నగరంలోని పలు అనాథ ఆశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సమాజ సేవలో టీఆర్ఎస్ సుబ్బారెడ్డి ముందుండేవారన్నారు. ఆయన బాటలో మరెన్నో సేవా కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తూ ఆయన ఆశయాలను నెరవేరుస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవింద నాగరాజు, పవన్‌కుమార్, లింగమూర్తి, కార్పొరేటర్ సుబ్బరాయుడు, కల్యా సుధాకర్ పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి



కడప వైద్య విభాగం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

కడప ఎర్రముక్కపల్లెకు చెందిన రాహుల్, సుశాంత్ ఈనెల 13వ తేదీన శ్రీశైలం వెళ్లి దేవుణ్ని దర్శనం చేసుకొని మంగళవారం తిరుగు ప్రయాణంలో గిద్దలూరు దగ్గర ప్రమాదవశాత్తు వారు ప్రయాణిస్తున్న కారు బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న వారు కడప ఎర్రముక్కపల్లెకు చెందిన రాహుల్, సుశాంత్ గాయపడ్డారు. ఈ విషయాన్ని కడపకు చెందిన పోలుదాసు కృష్ణమూర్తి ద్వారా తెలుసుకున్న పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి వెంటనే గాయపడిన వారిని ఫోన్ ద్వారా పరామర్శించి రాహుల్‌కు రూ.10వేలు, సుశాంత్‌కు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు కృష్ణమూర్తి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి చింతం వెంకట శివారెడ్డి, టీడీపీ నాయకులు గంగాధర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్లాం మతానికి విరుద్ధ కార్యక్రమాలు చేయరాదు



కడప వైద్య విభాగం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

కడపలో గల నౌషాద్ మస్జిద్‌లో ప్రభుత్వఖాజీలు సభ నిర్వహించారు. ఇందులో భాగంగా ముస్లిం సోదరులు పెళ్లి వేడుకలలో బ్యాండు, డ్యాన్సులు చేయడం, టపాసులు పేల్చడం వంటి కార్యక్రమాలు చేయడం ఇస్లాం ప్రకారం విరుద్ధమని ఏ విధంగా ఈ కార్యక్రమాలు ఆపాలని కడపలో ఉండే ఖాజీలు, మౌల్వీలు మసీదు ఇమామ్‌లు స్వచ్ఛత సంస్థ నాయకులని ఐకమత్యం చేసి సభలో చర్చించారు. అధ్యక్షులుగా ముక్తి రహిముల్లాఖాన్ వ్యవహరించారు. సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ కడపలో ఇటువంటి కార్యక్రమాలు చాలా ఎక్కువ అయ్యాయని దీనిని ఆపాలంటే ముఖ్యంగా ఖాజీలు పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరిని కూర్చోబెట్టి ఇటువంటి కార్యక్రమాలు ఉంటే మేం పెళ్లి చేయమని తెలపాలని తెలియజేస్తూ కడప జిల్లాలో ఉన్న 130 మసీదుల్లో ఇమామ్‌లు తమ ప్రసంగంలో తెలపాలన్నారు. ఈ కార్యక్రమానికి మౌల్వీ ఇసాక్ మాజీతో పాటు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని జయప్రదం చేశారన్నారు.

## ఎస్పీ గారూ.. మాకు రక్షణ కల్పించండి

### దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..



కడప వైద్య విభాగం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

కడప జిల్లా వేంపల్లె గ్రామం కాపు వీధికి చెందిన వీరబోయిన వేంపల్లె అమ్మ ఆదిమూలం ఆంజనేయులు, ఆది మూలం అంజనమ్మ లక్ష్మీదేవి శివశంకర్‌లపై అదే గ్రామానికి చెందిన ఆదిమూలం గంగయ్య కోళ్ల ఓబయ్య, ఆదిమూలం బాలలక్షుమ్మ మరో నలుగురు సోమవారం రాత్రి మమ్మల్ని చంపడానికి రోకలి బండతో వేట కొడవళ్లతో రాళ్లతో మాపై దాడి చేసి మమ్మల్ని గాయపరచడం జరిగిందని గాయపడిన వెంటనే మేమే ప్రభు త్వాసుపత్రిలో చేరడం జరిగిందని వీరబోయిన వేంపల్లి అమ్మకు ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు వెళ్లడం జరిగిం దన్నారు. నాపై దాడికి పాల్పడిన ఏడుగురిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసు కోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ విషయాన్ని కడప జిల్లా ఎస్పీకి ఫిర్యా దు చేయనున్నట్లు తెలిపారు. మాకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

## ఫొటోగ్రాఫర్లను గౌరవించాలి

### లయన్ ఖాదర్‌బాషా



కడప వైద్య విభాగం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరికీ ఒక ఫొటో ఎంతో అవసరమని అలాంటి అందమైన ఫొటోలు తీసే ఫొటో గ్రాఫర్లను గౌరవించాలని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా అన్నారు. ఆగస్టు 19వ తేదీ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం ఉన్న కడప నగరానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ పద్మ చంద్రారెడ్డిని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లయన్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ పద్మ చంద్రారెడ్డి ఫొటోగ్రాఫర్‌గా సేవలందిస్తూ తన వంతుగా ఎంతో మంది శిష్యులను తయారు చేస్తున్నారు. మరియు ఏపీలో ఫొటో అసోసియేషన్ సంఘానికి సేవలు అందించారు. రాష్ట్ర అధ్యక్షులుగా రెండు పర్యాయాలు సేవలు అందించారన్నారు. రాబోయే కాలంలో ఫొటోగ్రఫీలో సేవలు అందించిన సీనియర్ ఫొటో గ్రాఫర్లకు ప్రభుత్వం నుంచి సీనియర్ ఫొటోగ్రాఫర్ కాలనీ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీం సేవా సమితి అబ్దుల్ రాయల్ కరీం, యువ ఫొటోగ్రాఫర్లు రియాజ్ బాషా, నరసింహా, శివ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ సంక్షేమం అభివృద్ధే జగన్ లక్ష్యం

### ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్



ప్రొద్దుటూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త :

రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమం అభివృద్ధే జగన్ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక 24వ వార్డులో కౌన్సిలర్ షేక్ కమాల్ భాష ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికి తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును అభివృద్ధి కార్యక్రమాల పై ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని మైనారిటీల అభివృద్ధి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన కొనసాగిస్తూ మైనార్టీల పక్షపాతిగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. అర్హత గల ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేస్తూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 24 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు అంతే కాకుండా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు వైసిపి శ్రేణులు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు కౌన్సిలర్‌లు పిట్టా బాలాజీ జిలాని సత్యం ఇర్ఫాన్ భాష మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మల్లికార్జున యాదవ్ బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రసపుత్ర రజని, టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షులు అక్రమ్ మహమ్మద్ గౌస్, ఎద్దుల రాయపరెడ్డి ఆచార్యుల కాలనీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మురుగునీటి కాలువల నిర్మాణానికి భూమిపూజ**



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని ఆంధ్ర కేసరి సరి రోడ్డులో మురుగు నీటి కాలువల నిర్మాణానికి 55 లక్షల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు ముని రెడ్డిలతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పాత కోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు పురపాలక సంఘం సుందరీకరణ లో భాగంగా సబ్ రిజిస్టర్ కార్యాలయం నుండి మదూర్ బైపాస్ వరకు 980 మీటర్లు పొడవునా మురుగునీటి కాలువలు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పగడాల దస్తగిరి కౌన్సిలర్లు ఇర్ఫాన్ భాష జిలాని సత్యం మున్సిపల్ కమిషనర్ రమణయ్య ఇంజనీర్ ఉమామహేశ్వరి మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచితంగా గొర్రెలు మేకలకు నట్టల నివారణ

వాల్మీకిపురం,ఆగష్టు 18 :ప్రభాతవార్త



గొర్రెలు మేకలకు నట్టల నివారణకు వాల్మీకిపురం పశుసంవర్ధక శాక ఏడి నీరజ ఆధ్వర్యంలో ఉచితంగా చికితను అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గ్రామాలలో ఉచిత క్యాంపుల కార్యక్రమం సాగుతుంది.ఇందులో భాగంగా గురువారం ఒబులంపల్లి, నాగంవారిపల్లి, పునుగుపల్లి, వాల్మీకిపురంలో 1460 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ ఉచిత వైద్యం అందిస్తూ, ఢీ వార్మింగ్ మందులను పంపిణీ చేశారు. మండలంలో 10,400 గొర్రెలకు పంపిణీ చేశారు.అదే విధంగా గుర్రంకొండ మండలంలో 12 గ్రామాలలో 5500 మేకలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాక ఏడి మాట్లాడుతూ గెర్రెల పెంపకాలపై పలు సూచనలు అందించారు. జీవాలలో సాధారణంగా బద్దె పురుగులు,ఏలిక పాములు,నట్టలు అవతరించడం వలన జీవులలో బరువు తగ్గుతాయని తెలిపారు.కనుక వాటి నివారణకు ఎప్పటికప్పుడు గమనించుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం సర్పంచ్ గంగులమ్మ,డాక్టరు విశ్వేశ్వర రెడ్డి,సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాకు వచ్చిన జనసేన నాయకుడు నాదెండ్ల

కడప వైద్య విభాగం, ఆగస్టు 18, ప్రభాతవార్త:



జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్ గురువారం కడపకు విచ్చేయడంతో ఆయన్ను జిల్లా నాయకులు హజరత్ రఖేబ్ షావలి దర్గా భూమి 5/75 సెంట్లు భూమిని అధికార పార్టీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి బామ్మర్ది కృష్ణమూర్తి రావు కుమారుడు సుబ్రమణ్యం తన బావ అయిన సజ్జల రామకృష్ణారెడ్డి అండదండలతో స్థానిక ఎమ్మెల్యే సహాయ సహకారాలతో అధికారుల నిర్లక్ష్యంతో దర్గాకు సంబంధించిన విలువైన భూమిని దాదాపు రూ.200 కోట్లు విలువ గల భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార బలంతో దర్గా విషయంపై స్పందిస్తున్న నాయకులపై కేసులు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయనకు వివరించారు. దర్గా భూమిని, ఆస్తులను కాపాడాలని దర్గా కమిటీ వెళ్లి కలవడం జరిగిందని దానికి జనసేన రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్ స్పందించి అధినాయకుడు పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని ఈనెల 20వ తేదీ కడప జిల్లా సిద్దవటం వస్తున్నందున దర్గా విషయాన్ని చర్చించి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ఛైర్మన్ మహబూబ్‌బాషా, వైస్ ఛైర్మన్ షేక్ దస్తగిరి, సెక్రటరీ గౌస్‌బాషా, ఐయూఎంఎల్ జిల్లా అధ్యక్షులు అలీషేర్, జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ తాహిర్, జనసేన నాయకులు గౌస్‌బాషా, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పేరెంట్ కమిటీ నిర్ణయం మేరకే మెర్జింగ్ జరగాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:

మ్యాపింగ్ చేయాలనుకొంటున్న అన్ని పాఠశాలల్లో పేరెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ అధికారులను కోరారు. కమిటీ సానుకూల నిర్ణయం చేస్తేనే మెర్జింగ్ జరగాలని డిమాండ్ చేశారు. ఎంఎల్ఏ/ఎంపీలు ఇచ్చిన ప్రతి పాదనలు పాఠశాలలను మాత్రమే మెర్జింగ్ నుంచి మినహాయింపునకు అను మతి ఇవ్వడం ఏమిటన్నారు. జిల్లాలో 40 పాఠశాలల్లో మెర్జింగ్‌ను ఆపు చేస్తు న్నట్లు తెలుస్తుందన్నారు. మెర్జింగ్ అనుమతించిన అన్ని పాఠశాలల్లో కూడా తల్లిదండ్రులతో చర్చలు జరిపి తగు చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే పలు సమస్యలు చోటు చేసుకొనే అవకాశం ఉందన్నారు. అధికారులు సానుకూలతతో అర్థం చేసుకోవాలని కోరారు.

**ఇప్పటికైనా ఆపండి : ఏపీటీఎఫ్**

ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడం సరైంది కాదని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ విద్యాశాఖను కోరారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతు కొత్త సమస్యలు సృష్టించడంలో ప్రత్యేకత ప్రభుత్వం చాటుకుంటున్నదని వాపోయారు. మొబైల్ హాజరుతో కట్టడి చేయాలని చూస్తుండడం సబబుగా లేదన్నారు. ఇప్పటికైనా నాణ్యమైన డివై జులు, నెట్‌వర్కు సౌకర్యాలు పాఠశాల ప్రాంతాలలో కల్పించి బయోమెట్రిక్ హాజరు ను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణంలో చోటు చేసుకునే అసౌకర్యాలు కూడా లెక్కలోకి తీసుకోకపోవడం ఫేష్ స్కానింగ్ హాజరు జరగాలనడం శోచనీయమన్నారు.

## పంచాయతీ ఏకగ్రీవ నిధులతో తాగునీటి పనులు

తంబళ్లపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ గత ఎన్నికల్లో సర్పంచ్ తాళ్ల అరుణ చంద్రశేఖర్ ఏకగ్రీవమయ్యారు. పంచాయతీ ఏకగ్రీవానికి ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేయగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీలో తాగునీటి సమస్య పూర్తిగా నిర్మూలనకు బోరు, ట్యాంకు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా గ్రామంలో వెలసిన బోరులో తాగునీరు పుష్కలంగా పడడంతో పాటు ట్యాంకు నిర్మాణం శరవేగంగా జరగడానికి కృషి చేస్తామని సర్పంచ్, ఎంపీటీసీ కవితా పద్మనాభరెడ్డి, వాటర్‌షెడ్ ఛైర్మన్ మల్లికార్జునలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథ, భాస్కర్, ప్రతాపరెడ్డి, రమణ, ఈశ్వరయ్య, శివశంకర్, సాంబ, వెంకటరమణ, రాజు, దేవప్రకాష్, వాలంటీర్ మధు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

మదనపల్లె, ఆగస్టు 18 ప్రభాతవార్త

సచివాలయ ఉద్యోగిపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ మదనపల్లె మున్సిపల్ కార్యాలయం ముందు సచివాలయ ఉద్యోగులు ధర్నా చేశారు. గ్రామవార్డు సచివాలయ ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు మాట్లాడుతూ సెక్రటరీగా పనిచేసునతన్న హరి అక్రమ కట్టడాలపై విచారిస్తున్న సందర్భంలో భవన యజమానులు సచివాలయ ఉద్యోగిపై దాడి చేయడం దారుణమన్నారు. విధినిర్వహణలో ఉన్న ఓ ఉద్యోగిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ ధర్నాలో వినోధ్‌కుమార్, హరి, కిరణ్‌రెడ్డి, వెంకటేష్, సచివాలయ ఉద్యోతులు పాల్గొన్నారు.

## పెండ్లిమర్రి ఎంపీడీవోగా అల్తాఫ్ హుసేన్

పెండ్లిమర్రి, ఆగస్టు 18, ప్రభాతవార్త



పెండ్లిమర్రి ఎంపీడీవోగా అల్తాఫ్‌హుసేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. వారితో మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలుంటే ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణాష్టమికి ఏర్పాట్లు

ములకల చెరువు, ఆగస్టు 18, ప్రభాతవార్త



మండలంలోని వేపూరికోట సమీపంలోని శ్రీఆదినారాయణస్వామి ఆశ్రమంలో వెలసిన శ్రీకృష్ణుని విగ్రహం వద్ద కృష్ణాష్టమి సందర్భంగా వేడుకలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తు న్నట్లు నిర్వాహకులు వెంకట సుబ్బారెడ్డి స్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి పక్కన సుమారు 32 అడుగుల ఎత్తు గల శ్రీకృష్ణుని విగ్రహాన్ని నిర్మించారు. ప్రతి కృష్ణాష్టమికి ఈ ఆశ్రమం నందు పండుగ వాతావరణం నెలకొంటుంది.

## వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు

కడప కార్పొరేషన్, ఆగస్టు 18, ప్రభాతవార్త



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కడప నగరంలోని విద్యుత్తు నగర్‌లో కొలువుదీరిన శ్రీసిద్ధి బుద్ధి అష్ట భుజ వినాయక దేవస్థానంలో ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త, ఛైర్మన్ జి.ఎస్.బాబు రాయుడు పేర్కొన్నారు. గురువారం శ్రీ సిద్ధి-బుద్ధి వినాయక దేవస్థానంలో ఆయన మాట్లాడుతూ 5వ వార్షికోత్సవం సందర్భంగా స్వచ్ఛమైన నెయ్యితో తయారు చేసిన లడ్డూలను భక్తులకు ప్రసా దంగా అందిస్తామని తెలిపారు. గత ఏడాది 3వేల మంది భక్తులకు ప్రసాదం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది అదనంగా లడ్డూ ప్రసాదాలు భక్తులకు ఇస్తామని వివరించారు. నగర వీధుల్లో, కూడల్లు, ఖాళీ ప్రదేశాలలో, గ్రామాల్లో వినాయక చవితి పండుగ నాడు విగ్నేశ్వరుని ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించేకునే వారికి అవసరమైన వారికి తిరుపతికి చెందిన బ్రాహ్మణుల చేత ప్రత్యేకంగా స్వచ్ఛమైన నెయ్యితో తయారు చేసిన లడ్డూ ప్రసాదాలను మార్కెట్ ధరలకు అందిస్తామని తెలిపారు. లడ్డూ ప్రసాదాలు కావాల్సిన వారు 9701837827 నెంబరును సంప్రదించాలని కోరారు.

## జగనన్న కాలనీల వేగవంతానికి కృషి చేయండి

– నారాయణరెడ్డి

తంబళ్లపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



తంబళ్లపల్లె మండలంలో జగనన్న కాలనీల నిర్మాణాలు వేగవంతం చేయడానికి హౌసింగ్ అధికారులు చొరవ చూపాలని మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న కాలనీల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు సకాలంలో సిమెంటు, స్టీలు, ఇతర సామగ్రితో పాటు ఇసుక, ఇటుకలు అందించడానికి సహకరించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు కాలనీలలో మురికి నీటి కాలువలు, తాగునీటి బోర్లు, విద్యుత్తు సౌకర్యంతో పాటు మౌలిక వసతుల కల్పన జరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆశయ సాధనకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. అధికారులు నిత్యం పక్కా గృహాల నిర్మాణాలపై దృష్టి సారించి లబ్ధిదారుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమీక్షలో పద్మశాలి రాష్ట్ర డైరెక్టర్ సురేంద్రనాథ్, ఎంపీడీవో ఆనంద్‌కుమార్, హౌసింగ్ ఏఈ సురేఖ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేతన్న నేస్తం లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకం

ఏడీఓ వెంకట్‌కుమార్

తంబళ్లపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవడానికి ప్రకటించిన నేతన్న నేస్తం లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకంగా నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకట్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆనంద్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలంలో గతంలో 225 మందికి నేతన్న నేస్తం నిధులు మంజూరు కాగా నూతనంగా మరో 64 మందికి నేతన్న నేస్తం మంజూరైనట్లు చెప్పారు. మంజూరైన చేనేత కార్మికులు నిజమైన లబబ్ధిదారులా.. కాదా విచారణ చేపట్టినట్లు చెప్పారు. 2 రోజుల పాటు నేతన్న నేస్తం లబ్ధిదారుల విచారణ చేపట్టి ఈనెల 20న తుది నివేదికలు ఉన్నత స్థాయి అధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన లబబ్ధిదారులు జగనన్న నేతన్న నేస్తం దుర్వినియోగం చేయరాదని, ఇప్పటికే పెన్షన్ రాకపోతే తగిన ఆధారాలు తన దృష్టికి తెస్తే పెన్షన్ మంజూరుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## తంబళ్లపల్లె మండల హౌసింగ్ ఏఈగా సుజాత

తంబళ్లపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



తంబళ్లపల్లె మండల హౌసింగ్ ఏఈగా సుజాత నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న జగనన్న కాలనీల నిర్మాణంలో జాప్యం లేకుండా ఎక్కడా అవినీతికి తావు లేకుండా చూస్తానన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పక్కా గృహాలు వేగవంతంతో పాటు కాలనీలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు, లబ్ధిదారుల సమస్యలు తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు అదే విధంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అనునిత్యం పక్కా గృహాల నిర్మాణాలపై దృష్టి సారించేలా చర్యలు చేపడతానన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 18, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు ఉప్పరపల్లె క్షేత్రం, శ్రీసద్గురు సమర్థ నారాయణ ఆశ్రమం లో నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంరియు గోపూజ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని కావున భక్తాదులందరూ తప్పక పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

## లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు: ఎస్ఐ

రామాపురం, ఆగస్టు 18ప్రభాతవార్త



ఎలాంటి రికార్డులు లైసెన్స్‌ల పర్మిట్ లేకుండా వాహనాలు పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జయ రాములు తెలిపారు. మండల కేంద్రంలోని రామాపురంలో మూడు రోడ్ల కూడలి వద్ద గురు వారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు, టూవీలర్లకు ఆయన అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా నడపాలన్నారు. ప్రతి ఒక్కరు హెలిమెంట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించాలి

రామాపురం, ఆగస్టు 18ప్రభాతవార్త



మండలంలో ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు యజమానులు ఇప్పించాలని పశు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సరోజ, కీర్తనలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు గురువారం మాట్లాడుతూ మండలంలో 56000 నట్ల నివారణ మందు వచ్చాయన్నారు. మండలంలో ఆరు టీములుగా పర్యటించి గోపగుడిపల్లి,, సుద్దమల్ల, కల్పనాయి చెరువు, వెంకటరెడ్డిగారి పల్లి, చిట్లూరు గ్రామాల్లో పర్యటించి 12 వేల నట్టల నివారణ మందులు తాపించామన్నారు. మేకలు, గొర్రెల యజమానులు త్వరగా వాటికి మందులు ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సి. గణేష్ పాల్గొన్నారు.

## హంద్రీనివా భూనిర్వాసితులకు ఎకరా రూ.6లక్షలు

– ఆర్డీవో మురళీ

తంబళ్లపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త



తంబళ్లపల్లె మండలంలో హంద్రీనివా భూగర్భ కాలువ నిర్మాణంలో భూమి కోల్పోతున్న నిర్వాసితులకు ఎకరా రూ.6లక్షలు పరిహారంగా నిర్ధారించినట్లు మదనపల్లి ఆర్డీవో మురళీ తెలిపారు. గురువారం మండలంలోని గుండ్లపల్లి, కొటాల సచివాలయాల్లో కాలువ భూముల నిర్వాసితులతో గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన భూ నిర్వాసి తులతో ముఖాముఖి చర్చలు జరిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హంద్రీనివా భూగర్భ కాలువల నిర్మాణాలకు నిర్వాశిత రైతులు సహకరించాలని కోరారు. పనులు త్వరితగతిన పూర్తయితే మండలం సాగునీరుతో పాటు తాగు నీరు పుష్కలంగా ఉండి వ్యవసాయం సస్యశ్యామలమవుతుందన్నారు. స్థానిక రైతులు భవిష్యత్తులో వలస బాట మాని తమ భూముల్లో వ్యవసాయంతో అభివృద్ధి చెందగలరని ఆకాంక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లా డుతూ మండలంలోని 7 పంచాయతీల్లో సుమారు 93 ఎకరాలు హంద్రీనివా కాలువ నిర్మాణానికి అవసరం ఉంటుందన్నారు. ఈ భూమి స్థానిక రెవెన్యూ అధి కారులు ఇప్పటికే సర్వే నిర్వహించడం జరిగిందని రైతులు రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కాలువ నిర్మాణ భూముల్లో సుమారు 150 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించామని త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఈ గ్రామ సభల్లో ఆయన వెంట తహసీల్దారు కళావతి, మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయ డీటీ సుబ్బయ్య, హరిప్రసాద్, ఆర్ఐ రవి, సర్వేయర్ ముబారక్, సర్పంచులు మౌలాలి, బాబురెడ్డి, తులసి నాయక్, సహదేవరెడ్డి, చెన్నరాయుడు, సుధాకర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ లు, వీఆర్వోలు పూజారి వెంకట రమణ, మంజునాథ్, విశ్వం భరదరనాయుడు, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

## పెండ్లిమర్రి ఎంపీడీవోగా అల్తాఫ్ హుసేన్

పెండ్లిమర్రి, ఆగస్టు 18, ప్రభాతవార్త



పెండ్లిమర్రి ఎంపీడీవోగా అల్తాఫ్ హుసేన్ గురువారం బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్య దర్శులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. వారితో మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్య లుంటే ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్యటెక్నోస్కూల్ శ్రీక్రిష్ణాష్ణమి వేడుకలు

మదనపల్లె, ఆగస్టు 18 ప్రభాతవార్త



మదనపల్లె పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌బ్రాంచ్-1 శ్రీచైతన్య టెక్నో స్కూల్ లో ముందస్తు క్రిష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల శ్రీక్రిష్ణ వేషదారణలతో పలు వురిని అలరించారు. శ్రీక్రిష్ణ సత్యబామల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్కూలు ఆవరణంలో ఉట్లుకొట్టడం, కోలాటాలు చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాటకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ శ్రీక్రిష్ణుడు అవతార పురుషుడని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం శ్రీనివాసులు, ఆర్ఐ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాలలు ఐక్యతతో తమ హక్కులు సాధించుకోవాలి

రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షులు యమాల సుదర్శనం

కలికిరి, ఆగస్టు 18 ప్రభాతవార్త:



మాలలు అందరూ ఐక్యమత్యంతో ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శనం పిలుపు నిచ్చారు. గురువారం మండలంలో మాల మహానాడు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో త్వరలో రాష్ట్రమహానాడు సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని మాలసోదరులు అందరూ విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం మాలసోదరులకు కల్పించిన హక్కులను ప్రస్తుత ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని వాటిని మాలలు అందరూ ఐక్యమత్యంగా ఉండి ప్రభుత్వాలపై పోరాటాలు చేసి వాటిని సాధించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాలమహానాడు కార్యదర్శి యమలా చంద్ర, నాయకులు మనోహర్, మోహన్, జిల్లా మాలమహానాడు ప్రధాన కార్యదర్శి ఎస్‌టిడి హరి, నాయకులు నాగులయ్య, వేణుగోపాల్, ఎన్‌టి. రమణ. సహదేవ, మధు, సీనియర్ నాయకులు జె.సత్యనాథం, గద్దం ఏసు రాజు, పలువురు పాల్గొన్నారు.

## గోల్డన్‌వ్యాలీలో క్రిష్ణాష్టమి వేడుకలు

కురబలకోట, ఆగస్టు 18 ప్రభాతవార్త



అంగళ్ళు సమీపంలోని జివిఐసి హైస్కూలులో గురువారం ముందస్తు క్రిష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల శ్రీక్రిష్ణ వేషదారణలను అలం కరించి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్డన్‌వ్యాలీ కళాశాల కరస్పాండెంట్ ఎన్‌వి.రమణారెడ్డి మాట్లాడుతూ శ్రీక్రిష్ణుని అవతార పురుషుడని ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో సుగవాసి ప్రసాద్‌బాబు



చిన్నమండెం, ఆగస్టు 18ప్రభాతవార్త:

మండలంలోని దిగువ గొట్టివీడు గ్రామం కమ్మపల్లెలో గురువారం గురజాల బాలాజీనాయుడు నూతన గృహ ప్రవేశ వేడుకల్లో మాజీ టిటిడి పాలకమండలి సభ్యులు రాయచోటి టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతునాయుడు, ప్రతాప్ నాయుడు, దేవాగోపాల్ నాయుడు, మాజీ సర్పంచ్ చంద్రమోహన్, మాజీ మార్కెట్ కమిటీ సభ్యులు రమణ, రాజేంద్రనాయుడు, వెంకటేశ్వర్లు, చిన్నరెడ్డెయ్య నాయుడు, శశికుమార్ చౌదరి, పెంచలయ్య, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

కురబలకోట, ఆగస్టు 18 ప్రభాతవార్త



విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె డిఎల్‌పిఓ లక్ష్మీపతి హెచ్చరించారు. గురువారం ఆయన కురబలకోట సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా సచివా లయ సిబ్బంది అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని సూచించారు. ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఈయన వెంట ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్, గ్రామ సెక్రటరి ఎంజిటి ప్రసాద్ కలరు.

## హైజంప్‌లో జ్ఞానాంభిక కళాశాల విద్యార్థికి మొదటిస్థానం

మదనపల్లెక్రైం, ఆగస్టు 18 ప్రభాతవార్త



మదనపల్లెలోని శ్రీ జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భరత్‌కు హైజంప్‌లో జిల్లామొదటిస్థానం కైవసం చేసుకొన్నాడు. తిరుపతిలో జరిగిన అండర్-20 బాలుర విభాగంలో మొదటి స్థానం పొంది గుంటూరులో జరగబోయే రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. లాంగ్‌జంప్‌లో భరత్ రెండవ స్థానం కైవసం చేసుకొన్నాడు. ఈ విద్యార్థిని కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, ఫిజికల్ డైరెకటర్ శరత్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఇరుముడితో శబరిమలైకి వెళ్ళిన మంత్రి, ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

మదనపల్లె, ఆగస్టు 18 ప్రభాతవార్త



నలబై రోజులు పాటు ఎంతో భక్తి శ్రద్దలతో అయ్యప్పస్వామి దీక్షలో ఉన్న రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ టిజె భరత్ వందలాది మంది అయ్యప్ప స్వామి భక్తులు ఇరుముడితో శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. మాల ధరించిన వేలాదిమంది అయ్యప్పస్వామి భక్తులు స్థానిక ఆలయాల్లో ఇరుముడి కట్టుకొని భక్తిశ్రద్దలతో బయలుదేరి వెళ్ళారు. వీరందరూ మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో రైలుమార్గం ద్వారా శబరిమలైకి వెళ్ళారు. శుక్రవారం శబరిమలైలో శ్రీ అయ్యప్పస్వామిని ఆలయ కమిటి నిర్వాహకులు వీరికి ప్రత్యేక దర్శనం కల్పించనున్నారు. అత్యధికంగా పుంగనూరు, తంబళ్ళపల్లె మదనపల్లె, పీలేరు, తిరుపతి, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల నుంచి అయ్యప్ప మాల ధరించిన భక్తులు వెళ్ళారు. మంత్రి, ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇతర ప్రజాప్రతి నిధులు నిర్వహించిన ఇరుముడి కార్యక్రమంలో వందలాది మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోవాలి

ములకల చెరువు, ఆగస్టు 18, ప్రభాతవార్త



అర్హులైన ప్రతి ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోవాలని మండల అభివృద్ధి అధికారి రమేష్‌బాబు తెలిపారు. గురువారం నస్థానిక మండల పరిషత్ కార్యదర్శులు మరియు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో రమేష్‌బాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వారికి ఇళ్లు కట్టించడం చాలా ముఖ్యం కనుక ప్రతి ఒక్కరూ మనకు ఇచ్చిన 1483 ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్క గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రతి ఒక్కరూ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీల, ఉమామహేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## భార్యను వేధించిన కేసులో భర్త అరెస్ట్

ములకల చెరువు, ఆగస్టు 18, ప్రభాతవార్త

ములకల చెరువు మండలం కాలువపల్లికి చెందిన ఆసియా(18) ఈనెల 8న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విధితమే. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం డీఎస్పీ రవి మనోహరాచారి విచారణ చేపట్టి గజ్జి అల్లాబకాష్ కుమారుడు గజ్జి ఖాజా(22) భార్యను వేధించి ఆమె మృతికి కారణమైన ఖాజాపై డీఎస్పీ రవిమనోహరాచారి నిందితుడిని అరెస్టు చేసి అతనపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్పై డీవై స్వామి తెలిపారు.

## అనుమానాస్పద వ్యక్తులు అరెస్ట్

– మారణాయుధాలు స్వాధీనం

కడప క్రైం, ఆగస్టు 18, ప్రభాతవార్త:



కడప నగరం కాగితాలపెంట మసీదు వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానా స్పదంగా తిరుగుతూ మారణాయుధాలు కలిగిన వారి అరెస్టు చేసినట్లు కడప తాలూకా అర్బన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.ఉలసయ్య గురువారం తెలిపారు. ఆయన వివరాల మేరకు తన ఆదేశాలతో కడప తాలూకా అర్బన్ పోలీసుస్టేషన్ ఎస్సై ఎస్.కె.ఎం.హుసేన్ తన సిబ్బందితో కడప తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో గస్తీ తిరుగుతూ ఉండగా బుధవారం రాత్రి కాగితాలపెంట సర్కిల్‌లో గల మక్కా మసీదు ముందు ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండగా తాలూకా ఎస్సై వారిని సోదా చేసి విచారించగా వారు ముగ్గురు కాగితాలపెంటకు చెందిన షేక్ అమీర్‌బాషా, సయ్యద్ అఖిల్, షేక్ ఆదిల్‌గా గుర్తించామన్నారు. వారి వద్ద ఒక పిడిబాకు, బటన్ కత్తి, ఒంపు కత్తి ఉన్నాయని దీంతో వారిని ముందస్తు చర్య నిమిత్తం అరెస్టు చేయడం జరిగిందన్నారు.

## కల్వర్టును ఢీ కొన్న కారు

ఒకరు మృతి ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 18 ప్రభాతవార్త :



మృతి చెందిన గోపాలక్రిష్ణ (ఫైల్)

పిటిఎం మండలంలోని కాట్నగల్లు పంచాయితీలో బూచిపల్లె వద్ద ఓ కల్వర్టును కారు ఢీ కొని ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు అయిన సంఘటన గురువారం చోటు చేసు కొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. మదనపల్లె అమ్మినేని వీధికి చెందిన గోపాలక్రిష్ణ, స్నేహితులైన రాహుల్, సాయిరాంలు ముగ్గురు కలసి బుధవారం సాయంత్రం బూచిపల్లెలోని తన స్నేహితుని తండ్రి అంత్యక్రియలకు బయలుదేరారు. అంత్యక్రియల కార్యక్రమాన్ని ముగించుకొని గురువారం తెల్లవారుజామున మూడుగంటల ప్రాంతంలో మదనపల్లెకు కారులో బయలుదేరారు. బూచిపల్లె వద్ద కారు వేగం పెంచడంతో అదుపుతప్పి ఓ కల్వర్టును ఢీ కొని పక్కనే ఉన్న ముళ్ళపొదల్లోకి కారు దూసుకు పోయింది. దీంతో పక్కనే ఉన్న గ్రామస్థులు కనుగొని ముళ్ళపొదల్లోకి ఇరుక్కు పోయిన కారు, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురిని బయటకు తీశారు. గాయాల పాలైన క్షతగ్రాతులను 108లో మెరుగైన చికిత్సల కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గోపాలక్రిష్ణ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మిగతా ఇద్దరికి గాయాలై చికిత్సలు పొందుతున్నారు. మృతుని భార్య లావణ్య బి.కొత్తకోటలో హౌసింగ్ ఏఈగా పనిచేస్తుందని పోలీసులు తెలిపారు. గురువారం మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో మృతనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పచెప్పారు. కారు ప్రమాదం జరిగిన సంఘటనపై పోలీసులు విచారించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇద్దరు దొంగలు అరెస్టు

రూ.రెండులక్షల నగలు స్వాధీనం

మదనపల్లె ఆగస్టు 18 ప్రభాతవార్త

మదనపల్లె ఆర్టీసి బస్టాండు వద్ద ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెండవ పట్టణ సిఐ మురళీక్రిష్ణ తెలిపారు. గురువారం స్థానిక విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నా టక రాష్ట్రం చిక్‌బళాపూరం జిల్లా చింతా మణిటౌన్‌కు చెందిన కస్తూరి(24), కరియమ్మ (20)లు ఇద్దరు మదనపల్లె ఆర్టీసి బస్టాండులో ప్రయాణీకులు రద్దీగా ఉన్న సమయం, బస్సులను మహిళలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు వారి హ్యాండ్‌బ్యాగులను దొంగలించేవారు. ఈ క్రమంలో బంగారు నగలు పొగొట్టుకొన్న బాధితుల పిర్యాదు మేరకు బస్టాండులోని సిసి కెమరాల ఆధారంగా వీరి ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రెండులక్షల రుపాయల బంగారునగలు స్వాధీనంచేసుకొన్నట్లు తెలిపారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సిఐతో పాటు ఎస్ఐచంద్రమోహన్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎన్బి కళాశాలలో ఐసిఎస్ఐ స్టడీ సెంటర్

బద్వేలు, ఆగస్టు 18 ప్రభాతవార్త :



స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల యందు ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసియస్ఐ) అమరావతి చాప్టర్ వారు స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగానే గురువారం కళాశాల ఆవరణంలో తాఖీదుకు (ఎంఒయు) సంబంధించిన ఒప్పందం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసియస్ఐ అమరావతి చాప్టర్ ఛైర్మెన్ ఆర్.మణి కుమార్, ఐసియస్ఐ మాజీ ఛైర్మెన్ ఆంజనేయులు, ఐసిఎస్ఐ వైస్ ఛైర్మెన్ గంగ అనిల్ కుమార్, ఐసిఎస్ఐ ఇన్‌ఛార్జ్ రాంప్రసాద్, నాగభూషణం డిగ్రీ మరియు పీజీ కళాశాల పరిపాలన అధికారి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కంపెనీలలో హోదా పరంగా కంపెనీ సెక్రటరీ అత్యున్నతమైనదని, కంపెనీ, కంపెనీ సెక్రటరీల డిమాండ్ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా అధికంగా ఉందని, కనుక ఈ కోర్సు పూర్తి చేసి త్వరితగతిన ఉపాధి సాధించుకోవచ్చని తెలిపారు. కంపెనీ కోర్స్ యొక్క ఔన్నత్యాన్ని కోర్సు పూర్తి చేయుట ద్వారా పొందే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కోర్సు డిగ్రీతో పాటు కొనసాగించవచ్చని, తద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సిఎస్ కోర్స్ యొక్క రిజిస్ట్రేషన్ విధానాన్ని, కోర్సులోని వివిధ దశలను క్లుప్తంగా వివరించారు. ఈ కోర్సు పూర్తి చేసి విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును పొందగలరని, తద్వారా జీవితంలో స్థిరపడవచ్చన్నారు. రాయలసీమలో మొట్టమొదటగా కళాశాలకు ఈ స్టడీ సెంటర్ రావడం పై ఐసిఎస్ఐ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కళాశాల ఐసిఎస్ఐ స్టడీ సెంటర్ డైరెక్టర్ బత్తిన అశోక్‌తో పాటు, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నడి రోడ్డు పై తిష్ఠ

### రహదారిపై వెళ్ళేవారికి ఇక్కట్లు : రాకపోకలకు ఆటంకం

బద్వేలు రూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త :



స్థానిక చిరు వ్యాపారులకు, రోడ్డు పై వెళ్ళే వాహనదారులకు, వివిధ గ్రామాల ప్రజలు, పట్టణ వాసులకు హడావిడిగా పట్టణానికి వెళ్ళి వస్తుంటారు. ఇటువంటి సమయంలో ప్రతి రోజూ సాయంత్రం అయితే స్కూల్ బస్సులు, వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా రోడ్డు మధ్యలో పశువులు, మూగజీవాలు తిష్టవేసి వచ్చి పోయే వాహనదారులకు స్పీడ్ బ్రేకర్లుగా మారుతున్నాయి. వీటిని తప్పించుకోవాలంటే ప్రజలకు గగనమవుతోంది. పట్టణ శివారు ప్రాంతాల్లో కూడా యధావిధిగా ఉండడం, గంటల తరబడి పశువులు తిష్ట వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. వాహనదారులు రాత్రి పూట కొద్దిగా వేగంగా వెళుతున్న సమయంలో శునకాలు, పందులు, మూగజీవాలు గుంపులు గుంపులుగా రావడంతో వాహనదారులు ఇక్కట్లకు గురికావలసి వస్తుంది. కొన్ని ఏరియాలలో మూగజీవాలు తిరగబడి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తెల్లవారుజాము నుండి తోపుడు బండ్లపై ఆకు కూరలు, కూరగాయలు, పలు రకాల పండ్లను అమ్ముకునే వారికి స్థానికంగా శునకాల బెడదే ఎక్కువగా ఉంటుంది. దాంతో మూగజీవాలు అక్కడ పడవేస్తున్న ఆకు కూరలు, పండ్లు, చెత్తా చెదారాన్ని తింటూ అక్కడే కాలయాపన చేయడంపై సమయానికి పనులకు వెళ్ళవలసిన వారు కూడా వెళ్ళలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ సంఘటనలపై స్థానిక అధికారులు, మున్సిపల్ సిబ్బంది స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, చిరు వ్యాపారస్తులు కోరుతున్నారు.

## ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

వేంపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త :



వేంపల్లెలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి భవన్‌లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. నిర్వాహకులు విజయ, త్రివేణి, సౌమ్యల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణ జన్మాష్టమి హిందూ ఇతిహాసాలలో శ్రీమహావిష్ణువు 8వ అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం అన్నారు. కృష్ణ జన్మాష్టమిని కృష్ణాష్టమి లేదా గోకులాష్టమి అని కూడా పిలుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డికి శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గండి శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు రాయవరం శివరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై ప్రభుత్వ కక్ష సాధింపు ఆంక్షలు తగదు

వేంపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త :



ఉపాధ్యాయులపై ప్రభుత్వ కక్ష సాధింపు ఆంక్షలు తగవని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు ఎస్ఎండి షబ్బీర్ అన్నారు. గురువారం వేంపల్లెలో కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బోరెడ్డి జగన్నాథరెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావల్సిన డిఎ బకాయిలు, పీఎఫ్ రుణాలు, సక్రమంగా ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. పీఆర్సీ రద్దు కోసం అమరావతి ముట్టడి కార్యక్రమం చేపట్టిన నాటి నుండి ఉపాధ్యాయులపై వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. ఆన్‌లైన్ హాజరు, ముఖచిత్రం యాప్ ద్వారా హాజరు వేయడం, ఏ ఉద్యోగ వ్యవస్థలో లేని ఆంక్షలు కేవలం ఉపాధ్యాయులకే ఎందుకని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె పట్టణ శాఖ అధ్యక్షుడు ఆర్వి రమేష్, జిల్లా మాజీ కార్యదర్శి పి.వి.రమణ, ఐటీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోటూరు నాగభూషణం, మైనార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాబాషరీఫ్, బీసీ నాయకులు ఎం.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ డాక్యుమెంట్‌పై విచారణ చేపట్టండి

### సిఐకి విన్నవించిన బత్తల భాస్కర్

రైల్వేకోడూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న శ్రీనివాస థియేటర్ సమీప ముందు భాగాన ఉన్న 19 సెంట్ల భూమి నందు బత్తల సుబ్రమణ్యంకు చెందిన సందర్భంలో మామిళ్ళ సుబ్బన్న అనేవ్యక్తి రచ్చ చేస్తే కోర్టు నుండి 2000 లో విజయవంతంగా బత్తల సుబ్రమణ్యం వెలిశారని, అయితే ఈ మధ్య కాలంలో హైకోర్టు నందు విజయవంతంగా కోర్టుకు సంబంధించిన విషయంలో ఈ 19 సెంట్లు స్థలంలో భూమి హక్కు కలిగిన బత్తల సుబ్రమణ్యం భూమికి సంబంధించిన విషయంలో ఒక వ్యక్తి ఇదే సర్వేనంబరులో వెలిశెట్టి పిచ్చన్న ద్వారా అమ్మబడిన స్థలాన్ని 19 సెంట్లు వారసులు 2 అంకనాలు కొనినట్లు నకిలీ డాక్యుమెంట్‌లు గుర్తించి నానా రభస చేస్తూ రహదారికి అడ్డగించి గాంధీనగర్ వాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని బత్తల సుబ్రమణ్యం తమ్ముడు బత్తల భాస్కర్ గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఇదే సందర్భంలో సంబంధిత సిఐ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని, రౌడీయిజం, ధౌర్జన్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని సిఐ హెచ్చరించినట్లు బత్తల భాస్కర్ తెలిపారు. ఇటీవల కాలంలో రైల్వేకోడూరు మండలంలో ఫేక్ డాక్యుమెంట్‌లు సృష్టించి రైల్వేకోడూరు మండలంలో భూకబ్జాదారులు విచ్చలవిడిగా భూదందాలు నిర్వహిస్తున్నారని, దీనిపై అన్నమయ్య జిల్లా ఎస్పి దృష్టి సారించి బత్తల సుబ్రమణ్యంకు చెందిన 19 సెంట్లు స్థలంపై నిజనిర్ధారణ చేసి న్యాయం చేయాలని సుబ్రమణ్యం తమ్ముడు బత్తల భాస్కర్ స్థానిక విలేకరులకు తెలిపారు. ఇదే మార్గంలో ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు కూడ వెళ్లకుండా ఉండేందుకు ఆటంకాలు కలిగిస్తున్నారని, పాఠశాల సిబ్బంది కూడ ఆవేదన చెందారు.

## శ్రీ బాష్యం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

బద్వేలు అర్బన్, ఆగస్టు 18 ప్రభాతవార్త :



పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు, గోప బాలకులు వేషధారణలతో అందరినీ ఆకట్టుకోవడం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ కుంచాల వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులతో శ్రీ మహా విష్ణువు యొక్క ఎనిమిదవ అవతారమైన శ్రీ కృష్ణుని జన్మదినోత్సవాన్ని మనమందరం శ్రీ కృష్ణాష్టమిగా జరుపుకుంటామని తెలియజేశారు. శ్రీకృష్ణుని వృత్తాంతం వివరిస్తూ ధర్మం, అహింస, నిజాయితీపై పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అన్న గీతోపదేశంతో మానవాళికి దిశా నిర్దేశం చేసిన భగవంతుడు శ్రీ కృష్ణుడు అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, సంస్కృతి, సంప్రదాయాలను, పండుగల గొప్పతనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శ్రీ కృష్ణుని లీలలు మానవాళికి శుభ సందేశాలు అని పేర్కొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ కుంచాల సౌమ్య, ప్రధానోపాధ్యాయులు ఆసిఫ్ బాష, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం

పులివెందుల, ఆగస్టు 18, ప్రభాతవార్త :



భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు చిరస్మరణీయం అని పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షుడు గోటూరు చిన్నప్ప అన్నారు. పులివెందులలోని వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ కార్యాలయ ఆవరణలో గురువారం సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ చిత్రపటానికి చిన్నప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన బోస్ అందులో నుండి వైదొలిగి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చేరారని తెలిపారు. అహింసావాదమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, పోరుబాట కూడా అవసరమని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అనే రాజకీయ పార్టీని స్థాపించాడని తెలిపారు. 1945 ఆగస్టు 18న విమానంలో తైవాన్ మీదుగా టోక్యోకు ప్రయాణిస్తుండగా మరణించారని ఒక రకంగా ప్రచారం ఉండగా, ఆయన విమాన ప్రమాదం నుంచి బయటపడి అజ్ఞాతంలోకి వెళ్లాడని పలువురు నమ్ముతున్నారన్నారు. ఏదిఏమైనప్పటికీ ఆగస్టు 18న సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలను జరుపుకుంటారని తెలిపారు.

## రైతులతో సమావేశం

వీరపునాయునిపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త :

మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారికి భూములు కోల్పోయిన రైతులతో తహసీల్దారు ఉదయ భారతి గురువారం సమావేశం నిర్వహించారు. పాలగిరి, ఇందుకూరు గ్రామాలలో సమావేశం నిర్వహించారు. పాలగిరిలో జరిగిన సమావేశంలో రైతులు తమ పంట పొలాలను ఇచ్చేందుకు ఎకరాకు రూ.20లక్షలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఇందుకూరు గ్రామంలో తమ పొలాలను ఇచ్చేందుకు రైతులు నిరాకరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర తమకు గిట్టుబాటు కాదని నిరసన వ్యక్తం చేసి సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూస్తామని రైతులు తెలిపారు.

## విగ్రహ ప్రతిష్ట, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకుడు ప్రసాద్‌బాబు

రామాపురం, ఆగస్టు 18ప్రభాతవార్త:



మండలంలోని కుమ్మర పల్లె పంచాయతీ సూరకవాండ్లపల్లెలో గురువారం శ్రీ నాగ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా అన్నదానం చేస్తున్న దేరంగుల రెడ్డిప్రసాద్ ఆహ్వానం మేరకు మాజీ టిటిడి పాలక మండలి సభ్యులు రాయచోటి తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రసాద్‌బాబు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బి. కృష్ణయ్య ప్రసాద్‌బాబుకి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రసాద్‌బాబుకు గ్రామ ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికి బ్యాండ్ మేళాలతో పూలవర్షంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు గ్రామ నాయకులు, ప్రజలు శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, కృష్ణారెడ్డి, నరసారెడ్డి, రవి, నరసయ్య, చెన్నప్ప, నాగబసిరెడ్డి, నరసింహారెడ్డి, పల్లహరి, వెంకటరమణ, చంద్ర, మన్నేరు రామాంజనేయులు, మన్నూరు రాజశేఖర్, బడిశెట్టి రవికుమార్, కె.సి. ప్రసాద్, కోటి, ఎస్ఆర్ఎస్ రైస్ మిల్ ఓనర్ కిరణ్, నవాజ్, మస్తాన్, ముని, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేయని యాప్‌లో హాజరు నమోదు ఎలా?

వేంపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త :



పాఠశాల సమయానికి అరగంట ముందు నుండి ప్రయత్నం చేస్తున్నా యాప్ పనిచేయకోవడం వలన ఫేషియల్ అటెండెన్స్ వేయలేకపోతున్నామని కావున వ్యక్తిగత మబైల్‌ను హాజరు వేయడానికి ఉపయోగించలేమని, ప్రభుత్వమే అటెండెన్స్ డివైస్‌లను పాఠశాలలకు అందించేలా ఉన్నతాధికారులకు మా విన్నపాన్ని అందజేయాలని వేంపల్లె మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈవో వీరారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వమే డివైజ్‌లను ఇస్తే అవి సక్రమంగా పనిచేస్తే మేము అటెండెన్స్ వేయడానికి అభ్యంతరం లేదని, కానీ మాపర్సనల్ మొబైల్ ద్వారా అటెండెన్స్ వేయలేమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ, యూటీఎఫ్, పీఆర్టీయూ, వైఎస్ఆర్‌టీఎఫ్, ఏపీయూఎస్ సంఘాల ప్రతినిధులు మల్లు రఘునాథరెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, సూర్యనారాయణశెట్టి, కామేశ్వరరావు, ఇబ్రహీం,విజయసుధాకర్‌లు పాల్గొన్నారు.

## వెండి కవచాలు వితరణ

వేంపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త :



వేంపల్లెలోని గాండ్లవీధిలో వెలసిన శ్రీవల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అమెరికాలోని నార్త్ కేరలిన్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నంద్యాల విద్యాసాగర్, హిమబిందుల కుమార్తె సహస్ర స్వామి, అమ్మవార్లకు రూ.5లక్షలు విలువ చేసే వెండి కవచాలు ఆలయ అర్చకులు శేషగిరిరావుకు వితరణగా అందించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి సింగనమల సాంబశివుడు, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక కేంద్రాన్ని పరిశీలించిన ఎంపిపి

చిన్నమండెం, ఆగస్టు 18ప్రభాతవార్త:



మండల కంప్రేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిపి సుధామాధురి పరిశీలించారు. ఆసుపత్రి అభివృద్ధిపై వైద్యాధికారులతో చర్చించారు. రోగులకు మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలను పొందాలని ఆమె సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఎంపిపి సుధామాధురి తెలిపారు. డిప్యూటి డిఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 3వ స్థానంలో అవార్డు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డెవలప్‌మెంట్ మెంట్ మెంబర్లు ఛైర్మెన్ పి. సుధా మాధురి, మండల వైద్యాధికారి మధుసూదన్‌రెడ్డి, ఎంఆర్‌ఓ, ఎంపిడివో, స్థానిక సర్పంచ్ నజీర్ అహ్మద్, సిద్దయ్య, కలందర్, సందీప్‌కుమార్, సుధాకర్ రాజు, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా గునిశెట్టి రమేష్

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త



రైల్వేకోడూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా గునిశెట్టి రమేష్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా తలపాటి హరినాథ్, కోశాధికారిగా కామిశెట్టి వీరవెంకటసత్యనారాయణగుప్తా, శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులుగా కామిశెట్టి బద్రినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు అధ్యక్షులు గునిశెట్టి రమేష్ తెలిపారు. ఆర్యవైశ్య సలహాసంఘం అధ్యక్షులుగా కొప్పరపు నరసింహులు, మేడా వెంకటసుబ్బయ్య, పెదబల్లి సుందర్‌రాజా, కొత్త సుబ్బరాయుడు, గాదంశెట్టి చంద్రమౌళి, కామిశెట్టి పార్థసారథి వారి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. అయితే ఈ ఎన్నికల కార్యక్రమం 2022 నుండి 2025 వరకు పరిపాలనలో ఉంటుందని అన్నారు. తనను అధ్యక్ష బాధ్యతచేపట్టిన తరుణంలో రైల్వేకోడూరు ఆర్యవైశ్యులకు అందుబాటులో ఉండి నిరంతరం వారి సేవకే అంకితమవుతానని అన్నారు. ప్రతినిత్యం అందరికి అందుబాటులో ఉండి నిత్యం ఆర్యవైశ్యుల సేవకు అంకితమవుతామన్నారు. తన పదవికి సహకరించిన పెద్దలందరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఏవిఆర్ పాఠశాలలో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

బద్వేలు అర్బన్, ఆగస్టు 18 ప్రభాతవార్త :



పట్టణంలోని సిద్దవటం రోడ్ మార్కెట్ యార్డు వెనుక వైపున ఉన్న ఏవిఆర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తుగా పాఠశాలలో ప్రిన్సిపాల్ రంతుల్లా ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని విద్యార్థుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రంతుల్లా మాట్లాడుతూ శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వివరిస్తూ ధర్మం, అహింస, నిజాయితీ పిల్లలకు ఎంతో అవసరం అన్నారు. శ్రీ మహా విష్ణువు యొక్క ఎనిమిదవ అవతారమే శ్రీ కృష్ణుడని, వారి జన్మ దినోత్సవాన్నే మనమందరం శ్రీ కృష్ణాష్టమిగా జరుపుకుంటామని తెలియజేశారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అన్న గీతోపదేశంతో మానవాళికి దిశా నిర్దేశం చేసిన భగవానుడు శ్రీకృష్ణుడు అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకేపాటి ఎస్టేట్‌లో ముందస్తు కృష్ణాష్టమి

రాజంపేట అర్బన్, ఆగస్టు 18 ప్రభాతవార్త



మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో అమర్‌నాథ్‌రెడ్డి ఇంగ్లీషుమీడియం స్కూల్లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుని వేషధారణలో కనువిందు చేశారు. బాలికలు గోపికలుగా తయారయ్యారు. గోకులాష్టమి సందర్భంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే కార్యక్రమాలను స్కూల్లో నిర్వహించారు. విద్యార్థులచే ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణాష్టమి పండుగ గురించి ప్రిన్సిపల్ శ్రీదేవి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్యామలా గౌరి, ఉపాధ్యాయులు చందనప్రియ, శోభ, రాజ్యలక్ష్మి, స్వర్ణ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాల్ఫిన్‌డేల్ పాఠశాలలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

### చిన్నారులను ఉత్తేజపరిచిన పాఠశాల అధినేత పంజం

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని డాల్ఫిన్‌డేల్ పాఠశాలలో గురువారం పాఠశాల అధినేత పంజం సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలను చిన్నారులతో అద్భుతంగా రూపొందించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన అధినేత పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ డాల్ఫిన్‌డేల్ పాఠశాలలో ప్రతి పండుగను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తామని ప్రతిఒక్క విద్యార్థిని విద్యార్థులు వారికి పండుగలా స్థితిగతులను తెలియజేసేందుకే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులు వేసిన వేషదారణలో చూపరులను, తల్లిదండ్రులను కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలాకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వార్త పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన మండల విద్యాశాఖాధికారి

కాశినాయన, ఆగస్టు 18ప్రభాతవార్త:



బసనపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను, గ్రామస్తులను గురువారం మండల విద్యాశాఖాధికారి ఉపాధ్యాయునిపై పత్రికలో వచ్చిన కథనాన్ని గురించి విచారించగా వాస్తవమేనని తెలిసింది. మండల విద్యాశాఖాధికారి ముందరే గ్రామస్తులు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఉపాధ్యాయుడు మాకు వద్దు, ఇతను పాఠశాలకు సక్రమంగా రావడం లేదు, విద్యార్థులకు చదువు చెప్పడం లేదని తెలిపారు. పిల్లల చదువుల గురించి కన్నుకోవడానికి పాఠశాలకు వెళ్తే ఉపాధ్యాయుడు మాపైన దురుసుగా ప్రవర్తిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ విచారణలో వార్త పత్రికలో వచ్చిన సమాచారం నిజమని తేలడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంఇవో విద్యార్థులకు తల్లిదండ్రులకు, గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సరస్వతి స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

బద్వేలు అర్బన్, ఆగష్టు 18 ప్రభాతవార్త :



పట్టణంలోని నెల్లూరు రోడ్‌లో ఉండే సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యందు శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకొని ముందస్తుగా గురువారం పాఠశాల యాజమాన్యం కాకా సుబ్రమణ్యం యాదవ్, రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ప్రాచీన సాంప్రదాయాల గురించి, శ్రీ కృష్ణాష్టమి గోకులాష్టమి రోజున ప్రజలు ఏ విధంగా భక్తి శ్రద్ధలతో భగవంతున్ని పూజించాలనే విషయాలపై కళాశాల యాజమాన్యం కాకా సుబ్రమణ్యం వివరించారు. రాబోవు తరం వారికి మన సాంప్రదాయాలు తెలియజేయాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు పలు రకాల వేషధారణలతో అందరినీ అలరించారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు శ్రీ కృష్ణ లీలలు, శ్రీమన్నారాయణ అవతార లీలలు తెలియజేసి చివరగా పాఠశాల యాజమాన్యం కాకా సుబ్రమణ్యం యాదవ్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు హజరత్, మల్లిఖార్జున, హరి కుమార్, కరీం బాషా, శ్రీనివాసులు, సునీత, మౌనిక, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

పుల్లంపేట, ఆగస్టు 18 ప్రభాతవార్త



పుల్లంపేట మండల కేంద్రంలోని ప్రత్యూష ఉన్నత పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ముందస్తు వేడుకల్లో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా బాల బాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషదారణలు వేసి స్వామివారిని భక్తితో స్మరించి నిత్యప్రదర్శన, పూజా కార్యక్రమాలు చేసి తన్మయత్వం పొందినట్లు ప్రధానోపాధ్యాయులు నరసింహులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలి

కొండాపురం, ఆగస్టు 18, ప్రభాతవార్త :

పత్తి రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయకులు అశోక్ అన్నారు. గురువారం ఆయన కొండాపురం మండల కేంద్రంలోని తిమ్మాపురం, లావనూరు రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖరీఫ్‌లో సాగు చేసే పంటలను పరిశీలించి పంట నమోదు విధానాన్ని చూశారు. ఈ కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు నాగేశ్వరి, అంజనమ్మ, వాలంటీర్లు పాల్గొన్నారు.

## గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించాలి

### - సర్పంచ్ నాగార్జునాచారి

వీరబల్లి, ఆగస్టు 18ప్రభాతవార్త:



గొర్రెల, మేకల యజమానులు నట్టల నివారణ మందు తప్పకుండా వేయించాలని మట్లి సర్పంచ్ నాగార్జునాచారి కోరారు. గురువారం మట్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 4 వేల గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలు ప్రస్తుత సీజన్‌లో ఏలికపాము బద్దె పురుగు లివర్‌కు సంబంధించిన అంతర్ పరాన్న జీవుల వల్ల గొర్రెలు, మేకలు రోగాల బారిన పడి మరణించడం జరుగుతుందన్నారు. దీంతో పెంపకం దారులు సుమారు 30 శాతం ఆదాయం నష్టపోతున్నారని డాక్టర్ చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు ఇవ్వడం జరుగుతుందన్నారు. యజమానులే అవకాశ ం సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు నారాయణరాజు, వరప్రసాద్ రాజు, మేకల, గొర్రెల యజమానులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి గుడిలో ధ్వజస్తంభం ఏర్పాటు

చిట్వేలి, ఆగస్టు 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బ్రాహ్మణవీధిలో ఆంజనేయస్వామి గుడిలో ధ్వజస్తంభం ఏర్పాటుకు బ్రాహ్మణవీధి ప్రజలేకాక అందరు కూడ కలిసి గురువారం గణపతి పూజతో ప్రారంభించారు. బ్రాహ్మణవీధి ప్రజలు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు చరిత్ర కలిగితీ ఆలయానికి ధ్వజస్తంభం ఏర్పాటులో భాగస్వాములైన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్వామివారి ధ్వజస్తంభం కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని వారు విజ్ఞప్తి చేశారు. 3 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అరవిందస్వామి, బ్రాహ్మణవీధి ప్రజలు, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## మానవతా సేవలు అభినందనీయం

### జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి

రాయచోటి, ఆగస్టు 18 ప్రభాతవార్త :



అన్నమయ్య జిల్లా రాయచోటిలో గురువారం ఘనంగా మానవత ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాలలో భాగంగా అన్నమయ్య జిల్లా రాయచోటి మానవత చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి అధ్యక్షులు శంకర్ రెడ్డి ,ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిధిలుగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవ రెడ్డి,అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డి లు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ ర్యాలీ స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ సర్కిల్ మీదగా గాంధీ బజార్,ఠాణా సర్కిల్ మీదగా నేతాజీ కూడలి వరకు మానవత జెండాలు పట్టుకొని భారీగా ర్యాలీ కొన సాగింది.నేతాజీ కూడలి దగ్గర మనవహారంగా నిలబడి మానవత సంస్థ కార్యక్రమాలు,సేవలు,సంస్థ ఆవిర్భావ తదితర అంశాల పై వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఉత్తమైన సమ సమాజ నిర్మాణం కొరకు వ్యవస్థాపకులు రామచంద్ర రెడ్డి మానవత సంస్థను స్థాపించారన్నారు.ఈ సంస్థ ద్వారా అంబులెన్స్ తో పాటు శాంతి రథం,ఫ్రీజర్ బాక్స్‌ల ద్వారా ప్రజలకు సేవలు అందించడం అభినందనియమన్నారు. .ప్రతి నెల ఇద్దరు రైతులకు సన్మానించడం తో పాటు వారికి నగదు ప్రోత్సహకాలను అందజేయడం సంతోషకరమైన విషయమన్నారు.అంతే కాకుండా ప్రతిభా వంతులను గుర్తించి వారిని ప్రోత్సహించడం తో పాటు వారికి ఆర్థికంగా ఈ సంస్థ ద్వారా సహాయ సహకారాలు కూడా అందిస్తున్నారు.మానవత కుటుంబ సభ్యులు మాట్లాడుతు సంస్థ వారు మాట్లాడుతు అవిర్భావా వారోత్సవాలు వారం రోజులు పాటు ఘనంగా జరుగుతాయన్నారు.నైతిక విలువలతో పాటు పాఠశాలలో అవగాహన సదస్సులు ఏర్పటు చేసి వారికి మానవత ప్రశంస పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మానవత కుటుంబ సభ్యులు వీర విరిగా పాల్గొన్నారు.